ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 29, నవంబరు 2025

కృతజ్ఞతాభిషేకం

మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పశ్చిమంలో హర్షాతిరేకాలతోపాటు పాలాభిషేకాలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం మార్కాపురం పట్టణంలోని 32వ వార్డులో జరిగిన కృతజ్ఞతా సభలో చంద్రబాబు చిత్రపటానికి అక్కడి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న నేతలు సీఎంకు పశ్చిమ ప్రకాశం జీవితాంతం రుణపడి ఉంటుందని అన్నారు.

- ఆంధ్రజోతి, మార్కాపురం



జిల్లా పునర్విభజనపై అభ్యంతరాల స్వీకరణ

● కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా బాక్సు ఏర్పాటు ● 30 రోజులే గడువు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పునర్విభజనపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోపు తెలిపాలని కలెక్టర్ రాజాబాబు శుక్రవారం కోరారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసి ప్రత్యేక బాక్సులో తమ అభ్యంతరాలను ఉంచాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జిల్లాల (నిర్మాణ) చట్టం, 1974(చట్టం నెంబరు 7 ఆఫ్ 1974)లోని సెక్షన్3లోని సబ్ సెక్షన్(5) ప్రకారం సంబంధిత ప్రాంతాల మెరుగైన పాలన, అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు మార్కాపురంలో ప్రధాన కార్యాలయంగా ప్రాథమిక ప్రకటన జీవో నెంబరు 1497, రెవెన్యూ (ల్యాండ్స్4) డిపార్ట్‌మెంట్, 27 నవంబరు 2025, ప్రకాశం జిల్లాలోకి కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలు, కనిగిరి డివిజన్‌లోని రెండు మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలిపారన్నారు. కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్‌ను పది మండలాలతో ఏర్పాటు చేస్తూ సదరు మండలాలను ప్రకాశం జిల్లాలో కలుపుతూ ప్రాథమిక ప్రకటన ప్రభుత్వం జారీచేసిందన్నారు. దీని

మిగతా 6లో...

సిండికేట్‌గా దోచేశారు!

ఎస్‌ఎన్‌పాడు రైతు సహకార సంస్థలో భారీ అవినీతి



సంతనూతలపాడు సిండికేట్ రైతు సహకార సంఘం భవనం

నిబంధనలకు విరుద్ధంగా త్రిసభ్యకమిటీ నిధులు వాడకం

- రూ.కోటిపైగా స్వాహా
- అక్రమార్కులకు సహకరించిన సహకారశాఖ అధికారులు
- అడిట్‌లో వెలుగులోకి వ్యవహారం
- సెక్షన్ 51 విచారణకు డీసీవో ఆదేశం



గత వైసీపీ పాలనలో సహకారశాఖలో భారీగా అక్రమాలు జరిగాయి. అందుకు ఎస్‌ఎన్‌పాడు పీఏసీఎస్‌నే ఒక ఉదాహరణ. ఆ సొసైటీ పాలకవర్గంగా నియమితులైన త్రిసభ్య కమిటీ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. భారీగా రైతుల డబ్బును స్వాహా చేశారు. అందుకు నాటి సహకారశాఖ అధికారులు కొందరు సహకరించారు. కొంతకాలం అధికారుల పర్యవేక్షణలో కూడా సంస్థ సాగగా అప్పుడు కూడా అవకతవకలు జరిగాయి. ఈ విషయాన్ని ఇటీవల ఆ సంఘానికి సంబంధించి 2024-25 ఆడిట్ నిర్వహించిన ఒంగోలు సబ్‌డివిజన్ కార్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్రా సురేంద్రబాబు నిగ్గుతేల్చారు. మరింత లోతుగా విచారణ చేయాల్సిన అవసరాన్ని తదనుగుణ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో ఆ సొసైటీపై సహకారశాఖలో అత్యంత కీలకమైన సెక్షన్ 51 విచారణకు డీసీవో శ్రీలక్ష్మీ తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు.

ఒంగోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సేవా సహకార సంఘంలో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో అనేక సహకార సంస్థల్లో యథేచ్ఛగా నిధులను పక్కదారి పట్టించారు. ఎన్నికలు నిర్వహించకుండా తమ పార్టీ నాయకులను త్రిసభ్య కమిటీల సభ్యులుగా వైసీపీ ప్రభుత్వం నియమించింది. దీంతో ఆ కమిటీల సభ్యులు సహకారశాఖ అధికారులతో కుమ్మక్కు అయి భారీగా అక్రమాలకు

మిగతా 6లో...

అనేక సొసైటీల్లో ఇదే తరహా..

జిల్లాలోని అనేక సొసైటీల్లో అవినీతి పెద్దఎత్తున జరిగింది. ఆయా పీఏసీఎస్‌ల్లో సహకారశాఖ అధికారులు నిర్వహిస్తున్న ఆడిట్‌లలో ఈ విషయాలు వెలుగుచూస్తున్నాయి. సంతనూతలపాడు సిండికేట్ రైతు సేవా సహకార సంఘంలో భారీ అవినీతి, అక్రమాలు వెలుగుచూశాయి. ఆ సంఘానికి సంబంధించిన 2024-25 ఆడిట్‌ను ఒంగోలు అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్రా సురేంద్రబాబు ఇటీవల నిర్వహించగా భారీగా అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక కార్యకలాపాలు సాగినట్లు తేల్చారు. రూ.కోటికిపైగా రైతుల సొమ్మును అధికారుల సహకారంతో త్రిసభ్య కమిటీ కొట్టేసినట్లు తేల్చారు. ఆ సంఘం భవనం, గోడౌన్ నిర్మాణాల్లోనూ అక్రమాలు జరిగాయి. ఎంబుక్‌లో రూ.64 లక్షలు ఖర్చుచూపగా బ్యాంకులో రూ.98 లక్షలు డ్రా చేయడం గమనార్హం.

పశువుల షెడ్లు డిసెంబరు ఆఖరుకు పూర్తి చేయాలి

- ప్రభుత్వ ఆదేశాలతో డ్వామా అధికారుల హడావుడి
- క్షేత్రస్థాయి సిబ్బందితో పీడీ టెలీకాన్ఫరెన్స్
- జిల్లాలో పల్లెపండుగ 2.0 కింద షెడ్లు మంజూరు
- ఇప్పటిదాకా 758 గ్రౌండింగ్, 332 పూర్తి
- నెలలో మిగతా పూర్తికి ఆదేశం

ఒంగోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పల్లెపండుగ 2.0 కింద భారీగా పశువుల షెడ్లు మంజూరు కాగా వాటి నిర్మాణాలకు డిసెంబరు ఆఖరుకు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెండు రోజుల క్రితం కొనసీమ జిల్లా పర్యటనలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లెపండుగ 2.0 కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరుచేసిన పనులపై అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష చేసి పలు ఆదేశాలు ఇచ్చారు. అందులో జిల్లాలో పశువుల షెడ్ల నిర్మాణం, మొక్కలు పెంపకం పథకాలు ప్రధానంగా ఉండగా వాటిపై డ్వామా అధికారులు దృష్టిసారించారు. అందుకు సంబంధించి డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ శుక్రవారం జిల్లాలోని వివిధ మండలాలు ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు, క్లస్టర్ ఏపీడీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి నిర్దిష్ట వ్యవధిలో వాటి నిర్మాణాలు పూర్తికి ఆదేశించారు.



టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డ్వామా పీడీ జోసఫ్

భారీగా షెడ్లు మంజూరు

గత ఏడాది పల్లె పండుగ 1.0లో భాగంగా జిల్లాకు ఒక్కొక్కటి రూ.2.30 లక్షల విలువతో 1,058 పశువుల షెడ్లు మంజూరు చేశారు. దాదాపు 900 వరకు పూర్తయ్యాయి. గ్రామీణ ప్రాంత పశుపోషకులకు ఉపయుక్తంగా ఈ పథకం నిలువడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పలు మార్పులు చేసి మరింత ఎక్కువ సంఖ్యలో మంజూరు చేశారు. ఒక్కొక్కటి రూ.2లక్షల యూనిట్ విలువగా నిర్ణయించి జిల్లాకు 1,458 పశువుల

మిగతా 6లో...

జిల్లాపై దిత్వా ప్రభావం

● రేపు, ఎల్లుండి వర్షాలు పడే అవకాశం ● యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశం

ఒంగోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆది, సోమవారాల్లో జిల్లాలో వర్షాలు పడనున్నాయి. ఇప్పటికే చలి వాతావరణం జిల్లాలో నెలకొని ఉండగా మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు కురవచ్చన్న వాతావరణ శాఖ సంకేతాలు రైతాంగాన్ని కలవరపెడుతున్నాయి. గత నెలలో జిల్లాను మొంథా తుఫాన్ ముంచెత్తగా దాని నుంచి తేరుకొని గత వారం పదిరోజులుగా జిల్లావ్యాప్తంగా రబీ పంటల సాగులో రైతులు బిజీగా ఉన్నారు. చాలా ప్రాంతాల్లో ఇంకా పంటలు వేయాల్సి ఉంది. ఈ సమయంలో మరోసారి దిత్వా తుఫాన్ జిల్లాపై ప్రభావం చూపనుందన్న సమాచారం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతంలో బంగాళాఖాతంలో ఉన్న దిత్వా తుఫాన్ ఆదివారం ఉదయానికి చెన్నై- దక్షిణ కోస్తా తీరప్రాంతానికి చేరుకునే అవకాశం ఉంది. దానివల్ల ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం రాత్రి వరకు విస్తారంగా వర్షాలు కురవొచ్చు. ఆ ప్రభావం జిల్లాపై కూడా ఉండనుంది. ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలే కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

చెన్నై దాటివస్తే ప్రమాదమే

ఇప్పటి వరకు అందుతున్న సమాచారం ప్రకారం చెన్నై- పుదుచ్చేరి మధ్యలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉంది. అయితే చెన్నై దాటి రాష్ట్రంలోని తీర ప్రాంతం వైపునకు వస్తే తుఫాన్ ప్రభావం జిల్లాపై మరింత అధికంగా ఉంటుంది. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్న జిల్లాల అధికారులను ప్రభుత్వం అలర్ట్ చేసింది. ముందస్తు చర్యలకు సూచించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజాబాబు శుక్రవారం ఉదయం వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్ ఇతర సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.



మలుపులో వేగం అదుపు కాక..

ఆర్‌టీసీ బస్సు బోల్తా

● 13 మందికి గాయాలు ● ప్రయాణికులను బయటకు తెచ్చిన స్థానికులు

పెద్ద దోర్నాల,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూలమలుపు వద్ద వేగం అదుపు కాక ఆర్‌టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళుతుండగా శుక్రవారం మధ్యాహ్నం పెద్దారవీడు మండలం మద్దలకట్ట వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన ఆబ్ర అరుణ్‌కుమార్ సింగ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాకు చెందిన గోపాల్ కుమార్ సింగ్, ఆయన కుమార్తె సబిత కుమారిసింగ్, కర్ణాటక రాష్ట్రంలోని బొమ్మదేవర పల్లి గ్రామానికి చెందిన జీ మల్లప్ప మల్లేశ్, మల్లప్ప



ప్రమాదంలో గాయపడిన బాలుడు శివ

మిగతా 6లో...

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- దీక్షాధారులు ఐదుగురికి స్వల్పంగా గాయాలు
- మరొకరికి కాలు, పక్కటెముకల వద్ద గాయం

7

ఓబీసీకి పెరిగిన నీటి పరిమాణం

మేజర్లు, మైనర్లకు అందుతున్న సాగునీరు

దర్శి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెరిగింది. ప్రధానంగా చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ)కు నీటి పరిమాణం పెంచటంతో మేజర్లు, మైనర్లకు సక్రమంగా నీరందుతుంది. దీంతో రైతులు ముమ్మరంగా వరినాట్లతో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం వరకు ఒంగోలు బ్రాంచ్ కాలువకు అతితక్కువగా నీరు విడుదల అవుతుండటంతో చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందిపడిన విషయం తెలిసిందే. నీటి సమస్యపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు స్పందించిన అధికారులు ఓబీసీకి నీటి పరిమాణాన్ని పెంచారు. ప్రస్తుతం విడుదల అవుతున్న నీటి సరఫరా వివరాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువకు 9500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ఆ నీరు బుగ్గవాగుకు చేరుతుంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 9395 క్యూసెక్కుల నీరు పంపిణీ చేస్తున్నారు. ఆ నీటిని గుంటూరు బ్రాంచ్ కాలువకు 2200 క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 1510 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు(ప్రకాశం బార్డర్) 2502 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. జిల్లాకు విడుదలయిన నీటిలో ఒంగోలు బ్రాంచ్ కాలువకు 846 క్యూసెక్కులు, పమిడిపాడు కాలువకు 530 క్యూసెక్కులు మిగిలిన నీటిని దర్శి బ్రాంచ్ కాలువ పరిధిలోని మేజర్లకు పంపిణీ చేస్తున్నారు.

గత కొద్దిరోజుల క్రితం వరకు ఓబీసీకి కేవలం 650 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా చేయటంతో

మిగతా 6లో...



ఒంగోలు బ్రాంచ్ కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

అవినీతి ఆర్పీల్లో వణుకు!

మెప్మాలో అక్రమాలపై జేసీ గోపాలకృష్ణ విచారణ

సోమవారం మరోసారి రానున్న విచారణ కమిటీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో చోటుచేసుకున్న అవినీతిపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చైర్మన్‌గా, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, జడ్పీ సీఈవో చిరంజీవి నేతృత్వంలో శుక్రవారం మెప్మా ఆఫీసులో విచారణ చేపట్టారు. పొదుపు సంఘాల సభ్యుల పేర్లతో బోగస్ గ్రూపులు తయారు చేసి, భారీగా దోచుకున్న కొందరు ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. మరోవైపు అవినీతి నిగ్గుతేల్చాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఇప్పటికే విజిలెన్స్ విచారణ కోరారు. ఈ క్రమంలో జేసీ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభం కాగా, ఈ సందర్భంగా పలు రికార్డులను వారు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో గ్రూపు సభ్యుల వివరాలు, వారికి మంజూరైన రుణాల వివరాలను విచారణ కమిటీ పరిశీలించింది. ఇదే సమయంలో పలు రుణాలకు సంబంధించిన ఫైళ్లను



మెప్మాలో విచారణ చేపడుతున్న జేసీ గోపాలకృష్ణ

మిగతా 6లో...

స్పష్టత వచ్చింది!

● మెడికల్ కాలేజీలపై ఆరు కీలక అంశాలకు మంత్రి మండలి ఆమోదం



నిర్మాణంలో ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీ

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మార్కాపురంతోపాటు మదనపల్లె, ఆదోని, పులివెందులలో పీపీపీ పద్ధతిలో నాలుగు మెడికల్ కాలేజీల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం జీవోలు జారీచేసింది. ఈనేపథ్యంలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి, నిర్వహణకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర మంత్రిమండలి ఆరు కీలక అంశాలపై ఆమోదం తెలిపింది. ప్రధానంగా భూకేటాయింపు, సిబ్బంది బదిలీ, భవిష్యత్ అభివృద్ధి భాగాలు, బెడ్ల రిజర్వేషన్లు, బ్రాండింగ్, కన్సార్టియం పరిమితులకు

మిగతా 6లో...

'సిండికేట్'గా దోచేశారు!

(5వపేజీ తరువాయి)

తెగబడ్డారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) నుంచి క్షేత్రస్థాయిలోని పీఏసీఎస్‌ల వరకు అనేక సహకార సంఘాల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక వివిధ రూపాలలో అందిన ఫిర్యాదులతో డీసీసీబీపై విచారణకు ఆదేశాలిచ్చింది. ఆ మేరకు డీసీసీబీలో కలెక్టర్ నిర్వహించిన విచారణలో అనేక అక్రమాలు జరిగినట్లు తెలిందీ. దీంతో సదరు బ్యాంకుపై సెక్షన్ 51 విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

ఇష్టారాజ్యంగా ఖర్చుచేశారు

కేవలం సామాజిక, రైతు సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే కామన్ గుడ్ ఫండ్ వినియోగించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా రూ.40 లక్షలను రిజర్వు ఫండ్ ఖాతాకు బదిలీ చేశారు. మహజన సభ ఆమోదం లేకుండా కార్యాలయ ఎండీగా ఒక రిటైర్డ్ ఉద్యోగిని నియమించుకొని ఆయనకు నెల నెలా రూ.50వేలు వేతనం చెల్లించారు. నిబంధనలను పాటించకుండా నిర్మించిన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా ఖర్చును అంతకన్నా దారుణంగా చేశారు. సుమారు రూ.3.44 లక్షలు ఇందుకు వారు ఖర్చుచేయడం పూర్తిగా అక్రమమని ఆడిట్ అధికారి గుర్తించారు. ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగుల నియామకంలోనూ త్రిసభ్యకమిటీ అలాగే వ్యవహరించింది. ఇలా పలు అవకతవకలు, అక్రమాలతోపాటు భారీగా అవినీతి జరిగినట్లు ఆడిట్ నిర్వహించిన అధికారైన సురంద్రేబాబు గుర్తించి నివేదించారు. త్రిసభ్య కమిటీతో పాటు అప్పుడు ఆ సంఘం పర్యవేక్షణ చేసిన సహకారశాఖ అధికారుల తీరును తనిఖీ నివేదికలో పేర్కొన్నారు. వాటిని పరిశీలించిన డీసీవో శ్రీలక్ష్మీ సదరు వ్యవహారంపై సెక్షన్ 51 విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు తాజాగా ఇచ్చారు. విచారణాధికారిగా ప్రస్తుతం ఒంగోలు డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజస్ట్రార్ టి.మారుతిబాబును నియమిస్తూ గత రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

(5వపేజీ తరువాయి)



బాధితులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఎస్సై

బసవరాజు, విశాఖ పట్టణానికి చెందిన మోపాడి కనకరాజు, దేవిశెట్టి హర్ష, కొండపల్లి శివ, కొండపల్లి రాము, షేక్ సలీం, మసాల గణేశ్, నంద్యాల జిల్లా శివాపురానికి చెందిన బోయ యల్లనాయుడు, శివలకు గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న మిగిలిన వారికి ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నూజివీడు డిపోకు చెందిన ఏపీ39జడ్ 0358 నెంబరు గల ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళ్తుండగా మద్దలకట్ట వద్ద మూలమలుపులో వేగం తగ్గకపోవడంతో అదుపు తప్పి పల్టీలు కొట్టి పడిపోయింది. ఈ ప్రమాదాన్ని పరిసరాలలో పొలం పనులు చేస్తున్నవారు గమనించి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బస్సులోని వారిని బయటకు తీశారు. కొందరు 108కి సమాచారం ఇవ్వడంతో ఎర్రగొండపాలెం, దోర్నాల, మార్కాపురం నుంచి అంబులెన్స్ వాహనాలు వచ్చాయి. బస్సులో మొత్తం 25 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో 13 మందికి గాయాలు కాగా క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సలు నిర్వహించారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న పెద్దారవీడు, దోర్నాల ఎస్సైలు సాంబయ్య, మహేశ్ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. మార్కాపురం సబ్ కలెక్టర్ శివ రామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో బస్సును యథాస్థితికి తెచ్చారు. అనంతరం దోర్నాల వైద్యశాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పష్టత వచ్చింది!

(5వపేజీ తరువాయి)

సంబంధించిన ఆరు అంశాలపై మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకుంది. మార్కాపురం మెడికల్ కాలేజీకి గతంలోనే 49.99 ఎకరాలను సేకరించారు. ప్రస్తుతం 47.10 ఎకరాలను ప్రభుత్వం తీసుకోనుంది. ఆ భూమిని దీర్ఘకాలిక లీజుపై సంవత్సరానికి ఎకరానికి రూ.100 చొప్పున ప్రైవేటు సంస్థకు అప్పగిస్తారు. ఎన్ఎంసీ ప్రమాణాల మేరకు కొత్త మెడికల్ కాలేజీ క్యాంపస్, 625 పడకల బోధనాసుపత్రి, ప్రయోగశాలలు, విద్యార్థుల వసతిగృహాలు, సిబ్బంది నివాసాలు ఏర్పాటు చేయనున్నారు. పీపీపీ ఒప్పందం ముగిసిన తర్వాత అన్ని మౌలిక సదుపాయాలు, ఆస్తులు తిరిగి ప్రభుత్వానికి బదిలీ కానున్నాయి. ప్రభుత్వ కోటా కింద నీట్-అలైన్డ్ రిజర్వేషన్ కేటగిరీలతో 50శాతం సీట్లు ఉంటాయి. ఫీజులు ఏపీహెచ్ఈఆర్ఎంసీ నియంత్రణలో ఉంటాయి. ఆసుపత్రి పడకలు ప్రభుత్వ ఆరోగ్య పథకాలకు ఉచితంగా కేటాయిస్తారు. ప్రైవేటు యాజమాన్యంలోకి పూర్తిగా వెళ్లేలోపు రెండేళ్లపాటు ప్రస్తుత వైద్యశాలలోని సిబ్బంది జీతాలను ప్రభుత్వం చెల్లిస్తుంది. భవిష్యత్తులో డెంటల్ కాలేజీ, నర్సింగ్, పారా మెడికల్ ఇనిస్టిట్యూట్స్, ఆయుష్ స్థాపన, శిక్షణ, పరిశోధన కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం అనుమతులు ఇస్తుంది. అయితే వచ్చే ఆదాయంలో 3శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ప్రభుత్వ బ్రాండింగ్‌తోనే పనిచేస్తాయి.

30శాతం వరకు మాత్రమే ప్రైవేటు బ్రాండింగ్‌కు అనుమతిస్తారు. విద్యా, క్లినికల్ సేవా ప్రమాణాలను స్వతంత్ర పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షిస్తుంది. 2025 డిసెంబర్ 31న బిడ్డర్ ప్రకటన వెలువడనుంది.

అవినీతి ఆర్పీల్లో వణుకు!



విచారణలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

(5వపేజీ తరువాయి)

సోమవారం సిద్ధంగా ఉంచాలని పీడీ శ్రీహరిని జేసీ ఆదేశించారు. గురువారం మెప్మా ఎండీ కార్యాలయం నుంచి వచ్చిన ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ సోమవారం మరోసారి ఒంగోలుకు రానుంది. దీంతో బోగస్ రుణాలు పొందిన ఆర్పీలు, అందుకు సహకరించిన ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. మరోవైపు 2022 నుంచి విచారణ కమిటీకి చూపించాల్సిన రికార్డులు, పలు ముఖ్యమైన వివరాలు కనిపించకపోవడంతో మెప్మా అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. సోమవారం నుంచి ఇటు జేసీ కమిటీ విచారణ, మరోవైపు మెప్మా హెడ్ ఆఫీస్ నుంచి మరో కమిటీ ఒంగోలు విచ్చేయనుండటంతో అవినీతికి పాల్పడిన వారిలో వణుకు మొదలైంది.

ఏంటి ఇది మెప్మా కార్యాలయమా!?

జేసీ : ఏంటి ఇది మెప్మా కార్యాలయమా? ఏదో డెన్‌లాగా ఉంది? పారిశుధ్యం ఇంత అధ్వానంగా ఉంది ఏమిటి? కనీసం శుభ్రం చేసుకోరా?

పీడీ శ్రీహరి : నిధులు లేవు సార్, కొరత ఉంది.

జేసీ : నిధులకు మీకేం కొరత ఉంది? రాష్ట్రం మొత్తం మీ ఆఫీస్ వైపే చూస్తుంది.

పీడీ : సర్,

జేసీ: కోట్ల రూపాయల రుణాలు దోచుకున్నారని వార్తలు వస్తుంటే నిధులకు మీకేం కొరత.

జేసీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తుంది కదా. మీ డిపార్ట్‌మెంట్‌లో కనీసం అది కూడా చేయడం లేదా?

పీడీ : చేస్తున్నాము సార్.

జేసీ : చేస్తే ఇంత అధ్వానంగా ఎందుకు ఉంటుంది? చాలా దారుణంగా ఉంది.

మెప్మాలో జరిగిన అవినీతిపై విచారణకు విచ్చేసిన జేసీ గోపాలకృష్ణ, మెప్మా కార్యాలయం చూసి ఆశ్చర్యపోయారు. ఇది ప్రభుత్వ కార్యాలయంలా లేదు. ఇదేదో డెన్‌లాగా ఉందంటూ పీడీని ప్రశ్నించారు. పారిశుధ్యంపై దృష్టిపెట్టకుండా పేదల రుణాలపై దృష్టిపెట్టినట్టుంది అంటూ హెచ్చరించారు. సోమవారం మరలా తాము విచారణకు వచ్చే సమయానికి అంతా పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు.

జాతీయ వెబ్‌నార్‌కు విశేష స్పందన

అద్దంకిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలనందు కేఆర్‌కే డిగ్రీ కళాశాల, గుంటూరు సెయింట్ ఆన్స్ మహిళ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అండ్ కంప్యూటర్ సైన్స్ ద్వారా మేధ అనే శీర్షికతో ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన వెబ్‌నార్‌కు విశేష స్పందన లభించిందని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేల్పుల మోహనరావు తెలిపారు. ముందుగా పలు యూనివర్శిటీల నుంచి పలు విభాగాల ప్రొఫెసర్‌లు, వివిధ కళాశాలల అధ్యాపకులు తమ ప్రసంగాలను వినిపించారని తెలిపారు. కార్యక్రమానికి మొత్తం 575 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 29 మంది విద్యార్థులు వక్తృత్వ పోటీలో పాల్గొనగా వారిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటించినట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.2వేలను కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన టి. జాన్‌బానియస్ పొందగా, రెండవ బహుమతి రూ.1500లను కర్నూల్ సిల్వర్ జూబ్లీ కళాశాలకు చెందిన ఈ. లక్ష్మీనరసింహరావు, మూడవ బహుమతి రూ.1000ని గురుకుల పాఠశాల అద్దంకికి చెందిన పావని గెలుచుకున్నారన్నారు. జాతీయ స్థాయిలో ఇంత చక్కని కార్యక్రమం నిర్వహించిన కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు అభినందించారు.

5న వీఆర్‌ఏల ధర్నా

పంగులూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 5న తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.జందగిసాహెబ్ అన్నారు. పంగులూరు మండల వీఆర్‌ఏల సంఘ సమావేశం స్థానిక రోటరీభవన్‌లో శుక్రవారం నిర్వహించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ డివంబరు 5న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకురాలు పి.జ్యోతి, అద్దంకి మండల అధ్యక్షులు ధనరాజుపల్లి నాగేశ్వరరావు, నరశింహరావు, కార్యదర్శి కనపర్తి స్వాములు, పంగులూరు మండల అధ్యక్షులు కవల వీరయ్య, వి.ఆర్.ఏ.లు పాల్గొన్నారు.

వ్యవసాయంలో పంచసూత్రాలు విలువైనవి

అద్దంకిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతన్న- మీ కోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంలో ముఖ్యమంత్రి పంచసూత్రాల పాత్ర ఎంతో విలువైనదని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మణికేశ్వరం గ్రామంలో వ్యవసాయ సిబ్బందితో కలిసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి పంచసూత్రాల కరపత్రాలను రైతులకు అందజేశారు.

ప్రతి మహిళకు సొంతింటి కల సాకారం చేస్తాం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ సొంతింటి కలను నెరవేర్చేందు కు ప్రజా కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందని, ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీ4 కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా రేషన్ కార్డులు తొలగించారన్నారు. దీంతో నిరుపేదలకు సంక్షేమాలు అందకపోవడంతో పాటు నిలువ నీడ కూడా లేక అవస్థలు పడుతున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ప్రతి అర్జీని స్వయంగా స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నూతన గృహాలకు అందిన అర్జీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 261 అర్జీలు రాగా, సుమారు 220 నివేశన స్థలాలు, నూతన గృహాలకు సంబంధించి ఉండగా, 29 పించన్‌లు, 12 ఇతర సమస్యలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రసవ సమయంలో శిశువు మృతి

- వైద్యశాల వెలుపల తండ్రి శివయ్య నిరసన
- ద్రోణాదుల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఘటన



ఆస్పత్రి వరండా వద్ద బైఠాయించిన శివయ్య

మార్టూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ప్రసవ సమయంలో శిశువు మృతిచెందిన ఘటన మండలంలోని ద్రోణాదుల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. జంగ్రాజుపల్లి పరమేశ్వరి అనే మహిళ శుక్రవారం ప్రసవం కోసం వచ్చింది. గురు వారం ఇద్దరు మహిళా వైద్యురాళ్లు పద్మజ, డెల్ఫిన్‌ల ఆధ్వర్యంలో ఆమెకు ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువు ఉలుకు పలుకూ లేకపోవడం తో 108కి సమాచారం అందించారు. వారు ఆస్పత్రి వద్దకు వచ్చి తల్లి, బిడ్డను మార్టూరు లోని ప్రాంతీయ వైద్యశాలకు తీసుకొచ్చారు. దీంతో మార్టూరు ఆస్పత్రి వైద్యులు తల్లి బిడ్డను పరీక్షించారు. వారిలో బిడ్డ చనిపోయి నట్లు ధ్రువీకరించారు. అనంతరం తల్లిబిడ్డను వారి భర్త, బంధువులు ద్రోణాదుల గ్రామం లోని తమ ఎస్సీ కాలనీలోని ఇంటికి తీసుకువెళ్లారు. .ఇదిలా ఉండగా చనిపోయిన బిడ్డ తండ్రి, పరమేశ్వరి భర్త శివయ్య, ఆయన బంధువులు వైద్యులు నిర్లక్ష్యవైఖరి కారణంగా తన బిడ్డ చనిపోయారని, ఆరోపిస్తూ ఆస్పత్రి బయట నిరసన తెలి పారు. రెండు గంటల సేపు బైఠాయించారు. అంతేగాకుండా శివయ్య తరపు బంధువులు వైద్యులతో, సిబ్బందితో వాదనకు దిగారు. అయితే బిడ్డను బతికించడానికి ప్రయత్నం చేశామని, తల్లి ప్రాణం కాపాడటానికి తప్పనిసరి పరిస్థితుల్లో డెలివరీ చేయాల్సి వచ్చిందని నచ్చజెప్పడంతో వారు వెనుతిరిగారు.

తల్లిప్రాణం కాపాడడం కోసమే డెలివరీ

ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు ఆమెకు డెలివరీ చేశాం. ఉమ్మ నీరు పోవడంతోపాటు, ఆమెను ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి తీసుకొచ్చారు. సాధారణ డెలివరీ చేస్తున్న సమయంలో మొదట బిడ్డ కాళ్లు బయటకు వచ్చాయి. తరువాత బిడ్డను బయటకు తీశాం. ఈ సమయంలో ఆమెను ఇతర ఆస్పత్రికి పంపించడానికి సమయం లేదు. తల్లి, బిడ్డను బతికించడానికి ప్రయ త్నం చేశాం. తరువాత వారిని మార్టూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు 108 వాహనంలో పంపించాం. ఈ విషయాన్ని డీఎంఅండ్‌హెచ్‌వోకు ఆమె భర్తకు చెప్పాం.

డాక్టరు పద్మజ

పంట పొలాలను ముంచెత్తుతున్న దుమ్ము

పెట్టుబడి నష్టపోతామంటున్న రైతులు





లారీ వెంబడి లెగుస్తున్న దుమ్ము, పత్తిచేలపై పడిన దుమ్ము

బల్లికురవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డులో రోడ్ల వెంబడి ఉన్న పంటలకు దుమ్ము దూళితో నష్టం వాటిల్లుతోంది. నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తారు రోడ్డు మట్టి రోడ్డుగా మారింది. దీంతో రోడ్డుపై నుంచి వస్తున్న దుమ్ము పంటలపై పడి ఎదుగుదల లేకుండా పోతున్నాయి. అధికారులు కనీసం మరమ్మతులు చేయడం లేదని లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ, రోడ్డు దుమ్ముతో పంట చేతికి రావటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ముతో ఏటా



అధ్వానంగా ఉన్న రహదారి

పంటల సాగు సీజన్‌లో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు వాహనాలు వెళుతుంటే వెనుక వచ్చే ప్రజలు దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి అయి ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు.

బల్లికురవ-మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డులో నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు పూర్తిస్థాయిలో మట్టి రోడ్డుగా మారింది. ఈ రోడ్డులో ముందు వాహనం వెళితే వెనక వెళ్లే వారు దుమ్ములో మునిగిపోతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అధ్వానంగా తయారైన నాలుగు కిలోమీటర్ల రోడ్డు కిరువైపులా నక్కబొక్కలపాడు, మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతులు మొక్కజొన్న, మిర్చి, కంది, పొగాకు, కూరగాయల పంటలను బోరు బావులు వర్షాధారంగా సాగు చేశారు. ఈ పంటలు రోడ్డు నుంచి వస్తున్న దుమ్ముతో ఎదుగుదల లేకుండానే ఎండిపోతున్నాయి. రైతులు పలుమార్లు తాము పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నామని రోడ్డును వెంటనే అభివృద్ధి పరచాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని బల్లికురవ మార్టురు ఇర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి పరిచే వరకు ప్రతి రోజు రోడ్డుపై ఉదయం సాయంత్రం దుమ్ము రాకుండా నీటిని చల్లించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అవీఇవీ

మిరపలో గంజాయి మొక్కలు

సాగు చేసిన వ్యక్తి అరెస్టు



మిరపలో సాగు చేసిన గంజాయి మొక్కలను తొలగించిన అధికారులు

పెద్ద దోర్నాల, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): మార్కాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులు మండలంలోని జమ్మిదోర్నాలలో శుక్రవారం విస్తృతదాడులు నిర్వహించారు.మిరప పైరులోని గంజాయి మొక్కలను తొలగించి సాగు చేసిన వ్యక్తి బోయపాటి రాజబాబును అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు జమ్మిదోర్నాల గ్రామంలోని మిరపపంటలో గంజాయి మొక్కలున్నట్లు విశ్వనీయ సమాచారంతో దాడులు నిర్వహించామని, సాగు చేస్తున్న రాజబాబును అదుపులోకి తీసుకుని గంజాయి మొక్కలను ధ్వంసం చేశామని తెలిపారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్టుక్రింద కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.ఈ దాడుల్లో అసిస్టెంటు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డీ బాలయ్య, సీఐ ఎం వెంకటరెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు,



అర్జీలు స్వీకరిస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం ఉంటుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి,కొన్ని సమస్యలపై నేరుగా స్థానిక అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించారు. ఎక్కువగా భూసమస్యలు, వృద్ధాప్య పింఛన్లు, ఆరోగ్య సమస్యలపై ప్రజాదర్బార్‌లో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

రైతుల కోసం కాలువ మరమ్మతులు

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందుల, టీడీపీ నాయకులు

మార్కాపురం రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రైతన్నల ఆనందం కోసం కాలువ మరమ్మతు పనులను చేయించి నీటిని ఇస్తున్నామని ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్టేట్ లోని వై.జంక్షన్ వద్ద ఉన్న మార్కాపురం చెరువు అలుగు వద్ద నుంచి బోడపాడు చెరువుకు నీరు చేరే కాలువను ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి నాయకులతో కలిసి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించడంతో కొద్ది రోజుల నుంచి మార్కాపురం చెరువు అలుగు పారుతున్నదన్నారు. మార్కాపురం చెరువు నిండిన తర్వాత కాలువ ద్వారా బోడపాడు చెరువుకు ఈ అలుగు ద్వారా వచ్చి నీరు చేరతాయి. ఈ కాలువలో దట్టమైన పిచ్చి చెట్లు పెరగడంతో నీరు పోయేందుకు ఆటకంగా తయారైంది. ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి ఆదేశాలతో ఎక్స్‌కవేటర్ ద్వారా కాలువ పనులను చేయించి నీరు పోయే విధంగా చేయించారు. బోడపాడు టీడీపీ నాయకుడు బొగ్గు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు తమ పొలాలలో బోర్లకు నీరు సమృద్ధిగా అందుతుందని తెలిపారు.

జిల్లా పునర్విభజనపై అభ్యంతరాల స్వీకరణ

(5వపేజీ తరువాయి)

ప్రకారం ప్రకాశం జిల్లా రాజపత్రం నెంబరు 187, 188తో ఈనెల 27న పూర్తి వివరాలను ప్రకటించారన్నారు. పైన పేర్కొన్న ప్రతిపాదనలపై ప్రభావితమయ్యే అవకాశం ఉన్నా, జిల్లాలో నివసిస్తున్న వారందరి నుంచి అభ్యంతరాలు లేదా సూచనలు ఏమైనా చేసేందుకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇవి ఇంగ్లీషులో, తెలుగులో లిఖిత పూర్వకంగా ఉండాలన్నారు. ఈ నోటిఫికేషన్ తేదీ నుంచి 30రోజుల గడువు ముగిసేలోపు లేదా అంతకు ముందే సదరు అభ్యంతరాలు లేదా సూచనలు సంబంధిత కలెక్టరేట్ కార్యాలయం, ఒంగోలు చేరుకునేలా పంపాలన్నారు. కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులో బాక్సును ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

డిసెంబరు ఆఖరుకు పశువుల షెడ్లు పూర్తిచేయాలి

(5వపేజీ తరువాయి)

షెడ్లు కేటాయించారు. గత ఏడాది మంజూరై నిర్మాణాలు జరగని వాటిని కూడా వీటిలో కలిపారు. అలా జిల్లాకు కేటాయించిన 1,458 షెడ్లలో ఇప్పటివరకు 1,443కు కలెక్టర్ పరిపాలన ఉత్తర్వులు ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో 758 యూనిట్ల నిర్మాణాలు ప్రారంభించి అందులో 332 షెడ్ల నిర్మాణాలను పూర్తిచేశారు. మిగిలిన వాటి నిర్మాణాలను కూడా డిసెంబరు ఆఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో తదనుగుణ చర్యలపై వివిధస్థాయి అధికారులు, సిబ్బందితో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. నిర్మాణాలు చేపట్టాల్సిన అన్నింటినీ ఈ వారంలో ప్రారంభించి డిసెంబరు ఆఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన సామూహిక మొక్కల పెంపకం (ప్లాంటేషన్) పెండింగ్ లక్ష్యాలను తక్షణం పూర్తిచేయాలని ఆదేశించారు.

ఓబీసీకి పెరిగిన నీటి పరిమాణం

(5వపేజీ తరువాయి)

అధికశాతం మేజర్లు, మైనర్లకు నీరందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడ్డారు. ఓబీసీ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నీటి సంఘాల అధ్యక్షులు గొడవ చేయటంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి నీటి పరిమాణం పెంచారు. ప్రస్తుతం ఓబీసీకి 846 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుండటంతో ముమ్మరంగా చివరి భూముల్లో వరినాట్లు వేస్తున్నారు. కొంతమంది ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. మరికొంత కాలం ఓబీసీకి యథాతథంగా నీటి సరఫరా కొనసాగిస్తే చివరి ఆయకట్టు రైతులకు న్యాయం జరుగుతుంది.



డీబీసీ కాలువ

డిప్యూటీ ఎంపీడీవోలుగా పోస్టింగ్

కలెక్టర్ ఉత్తర్వులు జారీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ యాజమాన్యం, జిల్లా పంచాయతీ పరిధిలో పనిచేస్తూ డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందిన 38 మంది అధికారులకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కలెక్టర్ రాజాబాబు శుక్రవారం వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉద్యోగోన్నతులు పొందిన డిప్యూటీ ఎంపీడీవోలకు వారి సొంత మండలాలకు కాకుండా ఇతర మండలాలకు కేటాయించారు. గ్రామ సచివాలయాలను డిప్యూటీ ఎంపీడీవోలు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. జే రాజ రాజేశ్వరి(కురిచేడు), ఆర్‌వీ రామలింగేశ్వరరావు(త్రిపురాంతరం), కట్టా రాణి(పెద్దారవీడు), దారా వెంకట్రావు(సింగరాయకొండ), యు బాలాజీరెడ్డి(కేకేమిట్ల), చాంద్‌బాయ్(పొదిలి), పీ భాగ్యలక్ష్మి(ఒంగోలు), బీ సుధాకరరావు(చీమకుర్తి), జీవీఎస్‌ఎస్ ప్రసాద్(కొమరోలు), ఎ.ఆశా జ్యోతి(ఎన్‌జీపాడు), పీ రవికుమార్(సంతనూతలపాడు), ఓవీకే శ్రీనివాస కుమార్(రాచర్ల), ఎస్‌కే గరీబ్‌ఖాజా(మార్కాపురం)ను నియమించారు. డీ బ్రహ్మయ్య(కంభం), సీహెచ్ సురేష్‌బాబు(కనిగిరి), ఎస్‌కే హజరత్ ఆలీ(పామూరు), కే అంజయ్య(వైపాలెం), ఆవుల సుధాకరరావు(దర్శి), ఎ.బుచ్చిబాబు(ముండ్లమూరు), కే వెంకటఅప్పాజీ(అర్ధవీడు), ఎ.శ్రీనివాసులు(మద్దిపాడు), సీహెచ్ బాలకృష్ణమూర్తి(హనుమంతునిపాడు), ఎస్.రామ్‌ప్రసాద్(వెలిగండ్ల), ఏ శ్రీనివాసరావు(దోర్నాల), ఎల్ సునీత(టంగుటూరు), జే సురేష్(తర్లుబాడు), జీ వెంకటరాధాకృష్ణమూర్తి(దొనకొండ)ను నియమించారు. వీ బ్రహ్మానందరెడ్డి (సీఎస్‌పురం), ఎం కృష్ణారావు(పీసీపల్లి), పీ సుబ్బారావు(జరుగుమల్లి), డీ హరిప్రసాద్(మద్దిపాడు), ఎన్ సూర్యనారాయణ (కొండపి), ఎస్‌వీఆర్‌పీ చక్రవర్తి(పుల్లలచెరువు), బీ వెంకట్రావు(పొన్నలూరు), వీ శ్రీనివాసరావు(తాళ్లూరు), పీ శివబాబు(బేస్తవారిపేట), జీవీ నాగేశ్వరరావు(కొత్తపట్నం), ఎం. రామలింగేశ్వరరావు(గిద్దలూరు) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మార్కాపురం జిల్లా ఆమోదంపై సీఎంకు కృతజ్ఞతలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా ఆమోదంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలతో ప్రకాశం జిల్లా ఏర్పడిందని పేర్కొన్నారు. అధికశాతం ప్రజలు వ్యవసాయ, వ్యవసాయ కూలి పనులపై జీవిస్తున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ప్రాంత అభివృద్ధికి మార్కాపురం నూతన జిల్లా ఆవశ్యకతను 2024లో ముఖ్యమంత్రి చంద్రబాబును తాను కోరినట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి ఆదేశాలతో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కలెక్టర్‌ను నిర్దిష్ట సిఫార్సులు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారని పేర్కొన్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్‌ను కూడా కలిసి నూతన జిల్లా ఆవశ్యకతకు సంబంధించిన అన్ని విషయాలను తెలియజేయాలని ఆ ప్రాంత నాయకులు, ప్రజలు, అన్ని రంగాల వారిని కోరినట్లు తెలిపారు. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లాను ప్రకటించినందుకు సీఎం నివాసంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు మాగుంట వివరించారు.

ఎంఆర్‌పీఎస్ నాయకులపై కేసు కొట్టివేత

ఒంగోలు క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏళ్ల క్రితం ఎంఆర్‌పీఎస్ నాయకులపై బనాయించిన కేసును కొట్టివేస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.హేమలత తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 1998లో టంగుటూరులో మండల తహసీల్దార్ కార్యాలయం తగులబడింది. అందుకు బాధ్యులుగా అప్పట్లో ఎంఆర్‌పీఎస్ నాయకత్వంలో ఉన్న మందకృష్ణ, కొమ్మూరి కనకారావు, పేరిపోగు వెంకటేశ్వరరావు, చాట్ల రమేష్ తదితరులు 25 మందిపై కేసు నమోదు చేశారు. 2017లో కేసును స్ప్లిట్ చేసి కొట్టివేశారు. మిగిలిపోయిన మందకృష్ణ, కనకరావు, పేరిపోగు వెంకటేశ్వర్లు తదితరులపై ఇప్పటి వరకు కేసు నడిచింది. ఈ కేసులో మందకృష్ణ మినహా మిగిలిన వారందరిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు. కేసును పిట్టల లక్ష్మయ్య వాదించారు. మందకృష్ణ ఇప్పటి వరకు కోర్టుకు హాజరు కాకపోవడం వలన ఆయనపై కేసు కొనసాగుతోంది.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- దీక్షాధారులు ఐదుగురికి స్వల్ప గాయాలు
- మరొకరికి కాలు, పక్కటెముకల వద్ద తీవ్రగాయం

కొండపి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరిదేపి, ముప్పవరం గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు శుక్రవారం రాత్రి పడిపూజకు పెదకండ్లగుంట గ్రామం ఆటోలో వెళ్తూ కుక్క అడ్డు వచ్చింది. దాన్ని చోదకుడు తప్పించపోవడంతో ఆటో బోల్తా పడింది. బాధితులు, వారి బంధువులు తెలిపిన సమాచారం ప్రకారం... శుక్రవారం రాత్రి 8.30 నిమిషాల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఆటోలోని ఐదుగురు స్వాములకు స్వల్పంగా గాయాలయ్యాయి. పెరిదేపి గ్రామానికి చెందిన మార్పూరి వెంకటరావు స్వామికి కాలువద్ద, పక్కటెముకల వద్ద ఓ మోస్తరు గాయాలు కావడంతో 108 సిబ్బంది బాధితుడికి కొండపి సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.


వచ్చే నెల 1 నుంచి 41 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆయా ప్రాంతాలకు 41 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి-షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి 2026 మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు, డిసెంబర్2 నుంచి 9వరకు(మంగళ) రామేశ్వరం-తిరుపతి(06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని అధికారులు తెలియజేశారు.


జలఝరి, హరితసిరి.. పృథులగిరి..!



నీటితో నేలమట్టానికి చేరుకున్న చిన్నకోనేరు



భక్తులను అలరిస్తున్న సెలయేరు



కొత్తకుంటలో జలకళ



ఏడుబావుల పెద్దకోనేరులో సమృద్ధిగా నీరు

పవిత్ర పుణ్యక్షేత్రమైన పృథులగిరి సరికొత్త రూపును సంతరించుకుంది. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు జలకళతోపాటు హరితశోభను నింపుకుంది. కొండపైన ఉన్న నీటి వనరులన్నీ తొణికిసలాడుతున్నాయి. గలగలపారే జలసవ్వడులు భక్తులను కనువిందు చేస్తున్నాయి. పచ్చని చెట్లతో సింగారించుకుంది. పక్షుల కిలకిలరావాలతో ప్రతిధ్వనిస్తోంది. మర్రిపూడి కొండపై ఉన్న సీతమ్మ చెరువు, కొత్తకుంట, ఏడుబావుల పెద్దకోనేరు, భక్తుల దాహార్తి తీర్చే చిన్నకోనేరు నీటితో కళకళలాడుతున్నాయి. సెలయేరు సవ్వడులు ఆకట్టుకుంటోంది. జిల్లాలో ఉన్న నారసింహ క్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆధ్యాత్మిక శోభతో ప్రకృతి సోయగాలతో పులకించిపోతోంది.

- మర్రిపూడి, ఆంధ్రజ్యోతి

5న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

విద్యార్థుల తల్లిదండ్రులు, మార్గదర్శకులు, దాతలను పిలవాలి

విజయవంతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చేనెల 5వ తేదీన జరగనున్న మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే దృష్టి సారించాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను, దాతలను, ప్రొటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడంతోపాటు వారి సూచనలు, సలహాలను కూడా తీసుకొని అమలు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు రాబోయే వంద రోజుల్లో అమలు చేయనున్న విద్యా ప్రణాళికను కూడా తల్లిదండ్రులకు వివరించి ఉత్తమ ఫలితాలు రాబట్టడంలో సహకరించేలా కోరాలని విద్యాధికారులను ఆదేశించారు. సురక్షిత తాగునీరును విద్యార్థులకు అందించడంతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ వంటి పత్రాల కోసం వాట్సాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సేవలపైనా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి పాల్గొన్నారు.

పెళ్లి పందిరిలో దొంగల చేతివాటం

రూ.20లక్షల విలువైన సొత్తు అపహరణ

ఒంగోలు క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : పెళ్లి పందిరిలో దొంగలు చేతివాటం ప్రదర్శించి సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.1.35 లక్షల నగదును అపహరించుకెళ్లారు. ఈ సంఘటన నగర పరిధిలోని బృందావన్ గార్డెన్స్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. సంతనూతలపాడు మండలం మైనంపాడుకు చెందిన గుండవరపు కిషోర్‌కుమార్ కుమార్తె వివాహం బృందావన గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా పెండ్లి కుమారునికి ఇవ్వాల్సిన బంగారు ఆభరణాలు సుమారు 20 సవర్లు, రూ.1.35 నగదును ఓ బ్యాగ్‌లో పెట్టుకొన్నారు. వివాహ కార్యక్రమంలో అక్షితలు వేయడానికి వెళుతూ పెండ్లి పందిరిలోనే ఆ బ్యాగ్‌ను పక్కనపెట్టి వెళ్లారు. కొద్దిసేపటి తరువాత బంగారం పెండ్లి కుమారునికి ఇచ్చేందుకు బ్యాగ్‌ను చూడగా కనిపించలేదు. దీంతో కల్యాణ మండపం అంతా వెదికినా ప్రయోజనం లేదు. పెండ్లి కుమార్తెను రెడీ చేసే సమయంలో ఇరువురు యువకులు ఆ గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారని కొంతమంది ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అక్కడ ఉన్న మహిళలు అడ్డుచెప్పి ఎవ్వరు మీరు అని ప్రశ్నించడంతో హిందీలో సమాధానం చెప్పినట్లు చెబుతున్నారు. వారు ఇరువురు బంగారం ఉన్న బ్యాగ్‌ను అపహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బృందావన్ గార్డెన్స్‌లో సీసీ పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్ (కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్ (కిలో)	240.00

అర్హులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

అధికారుల సమావేశంలో జేసీ గోపాలకృష్ణ



సమీక్ష చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అర్హులైన పేదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జిల్లా స్థాయి దీపం, ఉజ్వల కమిటీ సమావేశానికి జేసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉజ్వల పథకం ద్వారా రెగ్యులేటర్, గ్యాస్ స్టౌవ్, సురక్ష ట్యూబుతోపాటు మొట్టమొదటి సిలిండర్ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్యాస్ కనెక్షన్లను జారీ చేసేందుకు భారత ప్రభుత్వ రంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఏరియా సేల్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. అర్హత ఉన్న వారందరిని గుర్తించి జాబితాలు రూపొందించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే సమయంలో అధికంగా వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటివి రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం సిలిండర్ రూ.898 మాత్రమే ఉందని, అంతకు మించి వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్. పద్మశ్రీ, సహాయ పౌరసరఫరాల అధికారి పుల్లయ్య, ఆయిల్ కార్పొరేషన్ అధికారులు రోహితష్ బాగారియ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో 'రాజు వెడ్స్ రాంబాయి' సందడి



సందడి చేస్తున్న హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజస్విని, చిత్రయూనిట్

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో రాజు వెడ్స్ రాంబాయి చిత్ర యూనిట్ శుక్రవారం సందడి చేసింది. హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజస్విని, డైరెక్టర్ సాయిలు, విలన్ పాత్రధారి జొన్నలగడ్డ చైతన్య, రచయిత మిట్టపల్లి సురేందర్ తదితరులు నగరంలోని గోపీ థియేటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సినిమా యూనిట్‌కు థియేటర్ యాజమాన్యం, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో వారు రాంబాబు పాటకు స్టెప్పులు వేస్తూ అభిమానులను అలరించారు. అనంతరం హీరోయిన్ తేజస్విని మాట్లాడుతూ ప్రస్తుతం సినీ పరిశ్రమలో తెలుగు హీరోయిన్లకు ఆదరాభిమానాలు ఉన్నాయన్నారు. తమ సినిమాను ఆదరించినందుకు అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. హీరో మాట్లాడుతూ ఒంగోలుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తమ సినిమాను విజయవంతం చేయడంపై ఆనందంగా ఉందని చెప్పారు.

అరాచకాలను ఎండగడతాం

ఏఐసీసీ కార్యదర్శి జావెద్



మాట్లాడుతున్న జావెద్, పక్కన షేక్ సైదా

ఒంగోలు క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను కాంగ్రెస్ పార్టీ ఎండగడుతోందని ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావెద్ చెప్పారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరుగుతోంది. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జావెద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రైవేటు సంస్థలన్నీ జాతీయం చేశామని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలు అన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అరచాక పాలన కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజి ఇస్తానని చెప్పిన బీజేపీ దాని ఊసే ఎత్తడం లేదని, అందుకు అధికార, ప్రతిపక్షాలు నోరుమెదపడంలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేసిందని, అందుకే ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ బీఆర్.గౌస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నం ప్రసన్నరాజు పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ తుదిపోరు

పాలకోడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నుంచి పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 13 ఉమ్మడి జిల్లాల అండర్-14 స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలు నువ్వా నేనా అన్నట్లు ఆయా జట్ల మధ్య జరిగాయి. ఆయా జిల్లాల నుంచి 312 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన నెట్ బాల్ పోటీల్లో బాలికలు విభాగంలో కృష్ణాపై పశ్చిమగోదావరి జట్టు 11-5 గోల్స్‌తో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. మరో జట్టు తూర్పు గోదావరిపై విశాఖపట్నం జట్టు 19-3తో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. అదే విధంగా బాలుర జట్టు పశ్చిమ గోదావరిపై తూర్పు గోదావరి జిల్లా జట్టు 12-10 తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. మరో మ్యాచ్‌లో నెల్లూరుపై విశాఖపట్నం బాలుర జట్టు 18-6 గోల్స్‌తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. శనివారం బాలురు, బాలికల జిల్లా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లు సాగనున్నాయని నిర్వాహకులు ఖుద్దూస్, చిట్టిబాబు, విజయలక్ష్మి, టోర్నమెంట్ అబ్జర్వర్ కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు తెలిపారు.

గుంత తీశారు..పూడ్చటం మరిచారు..!

● ఇబ్బందిపడుతున్న స్థానికులు



రోడ్డులో పూడ్చకుండా ఉంచిన గుంత

ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని బృందావన్‌గార్డెన్స్ 3వ ఫేజ్‌లో తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గుంత తీసిని కార్పొరేషన్ సిబ్బంది తరువాత దానిని అలాగే వదిలేశారు. ఈ గుంత తీసి ఇప్పటికి మూడు నెలలు అయ్యింది. కానీ ఇంత వరకు పూడ్చలేదు. పైపులైన్ మరమ్మతు కూడా చేయలేదు. దీంతో పైప లైన్ పైపు లైన్ మంచినీరు లీకై రోడ్డులో వృథాగా పోతోంది. అంతేగాకుండా మట్టిరోడ్డు కావడంతో ఈ ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. పిల్లలు ఆడుకుంటూ ఈ గుంతలో పడుతున్నారు. వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి ఈ పైపులైన్ మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - ఒంగోలు రూరల్(ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు





రోడ్డు పక్కన పడిపోయిన క్షతగాత్రురాలు, గాయపడిన వ్యక్తికి రక్తస్రావం కాకుండా కట్టు కడుతున్న యువకుడు

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో, మినీ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు ప్రయాణికులకు తీవ్రగాయాలైన సంఘటన మద్దులూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. ఆటో, మినీ లారీ ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓమహిళకు, ఓ వ్యక్తికి కాళ్లు, చేతులు విరిగాయి. మిగతా ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తూర్పునాయుడుపాలెం (కొండపి), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పునాయుడుపాలెంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు వర్షిత్, యశ్వంత్, శ్యాంకుమార్‌లు అండర్-14 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆ మేరకు శుక్రవారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఎస్‌వీ.సంధ్యారాణి, పీడీ ఎం.రాజ్యలక్ష్మి విద్యార్థులను అభినందించారు. ఇటీవల మైనంపాడులోని ప్రభుత్వ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న వీరు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ఎన్జీవో అసోసియేషన్ తాలూకా యూనిట్ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చీమకుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఏపీఎన్జీవో అసోసియేషన్ చీమకుర్తి తాలుకా యూనిట్ ఎన్నిక శుక్రవారం చీమకుర్తి ఎన్ఎస్‌పీ కార్యాలయంలో నిర్వహించారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక నామినేషన్ మాత్రమే రావటంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారి సీహెచ్ సీ.రవికుమార్ ప్రకటించారు. కాగా నూతన ఎన్నికైన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కె.బాలకోటయ్య, సహాధ్యక్షులుగా జి.వెంకటరావు, కార్యదర్శిగా షేక్ మస్తాన్‌వలీ, ఉపాధ్యక్షులుగా ఎ.రాఘవులు, ఇ.రాము, ఎం.రజనీదేవి, కోశాదికారిగా బి.కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా బి.అనూరాధ, కె.సీతమ్మ, ఐ.ఆంజనేయులు, మహిళా సంయుక్త కార్యదర్శిగా కె.విజయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హృదయరంజన్, తోట శ్రీనివాసరావు, కె.శరత్‌బాబు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ముందుకుసాగాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు

జరుగుమల్లి (కొండపి), నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ముందడుగు వేస్తున్నారని, వారిపై వివక్ష చూపడం సరికాదని వెలుగు ఏపీఎం జయరాజ్ అన్నారు. జండర్ వివక్షను వ్యతిరేకిస్తూ జరుగుమల్లిలో శుక్రవారం జరిగిన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో నాగేంద్రవదన్ మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కోమేశ్వరమ్మ, కార్యదర్శి సుజాత, సీసీలు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన ధూళ్ళ వెంకటేశ్వర్లు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. 20 రోజుల క్రితం పురుగు మందు తాగగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మొదట దర్శిలో చేర్పించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే దామచర్ల ● ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతుల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు విచ్చేసి తమ సమస్యలను ఎమ్మెల్యేకు రాతపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఒక్కరి సమస్యను అడిగి తెలుసుకోవడంతోపాటు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరిండమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరుతోపాటు, రుణాలు మంజూరు, వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎదురవుతున్న సమస్యలపై ప్రజలు విన్నవించినట్లు తెలిపారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కారం అయ్యేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మత్స్యకారులకు సరుకుల పంపిణీ

కొత్తపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధిత మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పంపిణీ చేశారు. శుక్రవారం రాత్రి కె.పల్లిపాలెంలో జరిగిన కార్యక్రమంలో మత్స్యకార కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లిగడ్డలు తదతర సరుకులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. తీర ప్రాంత గ్రామాలలో అభివృద్ధి తెలుగుదేశం పాలనలో జరిగిందని ఆయన చెప్పారు. గ్రామంలోని 1400 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకారులు సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గొల్లపోతు పేరయ్య, మత్స్యశాఖ ఏడీ ఎస్.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

● ట్రెజరీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మోహన్‌రావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ట్రెజరీశాఖ రాష్ట్ర డైరెక్టర్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ట్రెజరీశాఖ ద్వారా పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని రకాల సమస్యలను సకాలంలో పరిష్కస్తామని చెప్పారు. అందువల్ల పెన్షనర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు జిల్లాలో ట్రెజరీశాఖ పనితీరు తదితర అంశాలపై సంబంధితశాఖల అధికారుల అధికారులతో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ట్రెజరీశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జగన్నాధరావు, ఒంగోలు సబ్ ట్రెజరీ అధికారి ఎన్‌వీ.కృష్ణ, ఏపీటీఎస్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమణారెడ్డి, ఏటీవోలు కేవీ.కెనడీ, ఏపీటీసీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ.కృష్ణ, పి.అక్కేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీఎల్ఎస్.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావుకు నివాళులు



సంతనూతలపాడులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాలు శుక్రవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. స్థానిక వైసీపీ కార్యాలయంలో బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకులు కేవీ.రమణారెడ్డి, బొట్లా రామారావు, కుప్పం ప్రసాద్, దుంపా రవణమ్మ, దుంపా చెంచిరెడ్డి, ఉప్పలపాటి ఏడుకొండలు, రొండా అంజిరెడ్డి, క్రాంతికుమార్, పెట్లూరి ప్రసాద్, దాసరి కరుణాకర్, తాతా నరసింహగౌడ్, పాలడుగు రాజీవ్, షేక్ మీరావళి, సయ్యద్ అప్సర్, బత్తుల ప్రమీల, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

- జిల్లా మాల జేఏసీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని స్థానిక జేఏసీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు మేడిది రవికుమార్, శ్రీహరి, జాన్, కత్తి సుదర్శన్, రత్నం, శాంతారావు, లక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

- దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు స్థానిక కొత్తమార్కెట్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాకుమాను రవి పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పూలే చిత్రపటానికి రిజిస్ట్రార్ హరిబాబు, ప్రొఫెసర్లు నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీవోఏ రాజమోహన్, సీఈ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతందేవ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి జ్యోతీరావుపూలే అని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామ్మూర్తి, సీహెచ్‌వీ.సుబ్బయ్య, అంజయ్య, పోలిశెట్టి, పీఎన్ఎస్.చౌదరి, మాధవి, రంగనాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పూలే వర్ధంతిని శుక్రవారం చీమకుర్తి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అణగారిన కులాల ఐక్యవేదిక, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బండ్ల కొండలరావు అధ్యక్షతన స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపాన ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, బీసీ నాయకుడు బత్తుల మల్లిఖార్జునరావు, కోటా రాములు, వేమా బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారికి ఘన సత్కారం

● హాజరైన జిల్లాలోని న్యాయవాదులు



న్యాయాధికారి భారతిని సత్కరిస్తున్న న్యాయవాదులు

ఒంగోలు(రూరల్), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధానన్యాయాధికారి ఎ.భారతి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఒంగోలు బార్ అసోసియోషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాదికారి భారతి మాట్లాడుతూ తోటి న్యాయాధికారులు, న్యాయవాదులు తాను మంచి తీర్పులు ఇచ్చేందుకు ఎంతగానో దోహదపడ్డారని తెలిపారు. ఇక్కడ ఉద్యోగ విరమణ చేయటం కొంతబాధగా ఉన్నప్పటికీ సంతోషంగానే ఉన్నదన్నారు. కేసుల్లో బాధ్యతగా, సమన్వయంతో ఉంటూ మంచి తీర్పులు ఇచ్చేందుకు అందరూ సహకరించాలని ఆమె సూచించారు. అనంతరం బార్ అసోషియోషన్ అధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతో జిల్లా న్యాయాధికారి భారతి జిల్లాలో ఎన్నో ఉత్తమమైన తీర్పులు ఇచ్చారని కొనియాడారు. ఆమె సేవలు మరవలేనివని, చిరస్థాయిగా అందరి మనస్సుల్లో నిలిచి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, కందుకూరు, అద్దంకి బార్ అసోషియోషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

● హాజరైన క్విస్ కళాశాల అధినేత సూర్యకల్యాణ్ చక్రవర్తి



సీలింగ్‌ఫ్యాన్‌ను అందజేస్తున్న సూర్యకల్యాణ్‌చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పటల్ వైద్యాధికారులు సుమారు 150మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత, ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉన్నవారిని గుర్తించి తక్షణం వైద్యశాలకు వెళ్ళేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారీస్‌ట్రస్టు, ఎన్ఎస్‌కేసీ ట్రస్టు సంయుక్తంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందించి వారితో కలిసి భోజనం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యానును అందజేశారు. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్ తదితర అంశాలపై మాట్లాడారు. గ్రామస్తులకు డెస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు రామాంజనేయులు, విజయలక్ష్మి, కార్తికేయరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త వాసుబాబు, క్విస్ డీన్ వనీత్‌కృష్ణ, పీవోలు శిరీష, వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా శనివారం ఒంగోలు నగరంలో పలుచోట్ల కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ రంగారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక కర్నూల్ రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, భారత్‌పెట్రోల్ బంకు, మారుతినగర్, ఆగ్జిలియం స్కూల్, ఎస్‌బీఐ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తారన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు సూచించారు. మైనంపాడు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యపనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించాలన్నారు. మంచినీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. మొంథా తుఫాన్ సమయంలో పంచాయతీ సిబ్బంది అందరూ బాగా పనిచేశారని తెలిపారు. మరలా దిత్వా అనే తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉందని, ఈక్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అన్నదాత, పీఎం కిసాన్ సంక్షేమ నగదు పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చాకు కూలీలకు ఇన్సూరెన్స్ కల్పించాలి

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పచ్చాకు కూలీలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వ్యవసాయకార్మికసంఘం నాయకులు డిమాండ్ చేఉశారు. శుక్రవారం పచ్చాకు కూలీలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పచ్చాకు కూలీలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు, పొగాకు బ్యారెన్ వద్ద వద్ద పనిచేసే కూలీలకు వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు మేయర్‌పై అవిశ్వాసం దారుణం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాసం పెట్టడం దారుణమని యాదాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, రాష్ట్ర కన్వీనర్ బత్తిన లక్ష్మీశేఖర్ విమర్శించారు. అవిశ్వాస తీర్మానం పెట్టడాన్ని నిరసిస్తూ అన్ని జిల్లాలో పర్యటిస్తూ శుక్రవారం ఒంగోలుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లూరు జిల్లాలోని కొన్ని రాజకీయ పార్టీలు అవిశ్వాస తీర్మానం పెట్టడం సరికాదన్నారు. రిజర్వేషన్ల ద్వారా గిరిజనులకు వచ్చిన అవకాశాలను దెబ్బతీయడం దారుణంగా ఉందని విమర్శించారు. నెల్లూరు మేయర్ గా తన పదవికి వన్నె తెస్తున్న స్రవంతిని పదవి నుంచి తొలగించేందుకు కుట్రలు పన్నడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విధానాలను మార్చుకోకపోతే తగినమూల్యం చెల్లించక తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చేవూరి వెంకటేశ్వర్లు, చల్లంపర్ల ప్రసాద్, నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న నారాయణ స్వామి వర్ధంతి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భూస్వామ్య, సామ్రాజ్యవాద నిరంకుశ పెట్టుబడిదారి కూటమికి వ్యతిరేకంగా పోరాడిన మాదాల నారాయణస్వామి 12వ వర్ధంతి కార్యక్రమాన్ని వచ్చేనెల 9వతేదీన గుంటూరులో నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీఎస్.సాగర్, నాయకులు బి.పద్మ, అరుణోదయ జాలన్న, అంజయ్య, రాజశేఖర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పొగాకు వేలం : ఆర్‌ఎం

మద్దిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ కేంద్రంలో పరిధిలో సుమారు 2400 బ్యారెన్‌లలో ఐదువేల మంది రైతులు ఉండగా ప్రభుత్వం అనుమతి ప్రకారం 15.34 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు నిర్వహించారు. ఆర్‌ఎం రామారావు సూచనల మేరకు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేలం ప్రకియను నడిపించారు. 198 రోజుల పాటు సాగిన వేలం ప్రకియలో రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాల చౌదరి, మండవ గోవిందరాజులు, బోయపాటి వెంకయ్య, మండవ శ్రీరామమూర్తి, రైతులు సమన్వయంతో సహకరించారు. దాదాపు రూ.304 కోట్ల అమ్మకాలు జరిగాయి. గత నాలుగేళ్ల కంటే ఈ ఏడాది అధికంగా పొగాకు సాగు చేశారు. తుఫాన్లు దెబ్బకు పొగాకు దెబ్బతినిపోవడంతో రైతులకు నష్టం కలిగిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అబ్బూరి శేషగిరిరావు కోరారు. 40 కంపెనీలు వేలంలో పాల్గొనగా సగటున రూ.297.99 ధర నమోదైంది.

పదో తరగతి పరీక్షల ఫీజు గడువు పెంపు


ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా వచ్చేనెల 6వతేదీ వరకు, రూ.50 రుసుంతో 9వతేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో 12వతేదీ వరకు, రూ.500 రుసుంతో వచ్చేనెల 15వతేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. ప్రభుత్వం చివరి అవకాశం కల్పించినందున ప్రధానోపాధ్యాయులందరూ విద్యార్థులు త్వరగా ఫీజులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ

ఒంగోలు(రూరల్), నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు దళితవాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం డ్వాక్రా రుణాల అవకతవకలపై వెలుగు సీసీలు షేక్ మస్తాన్, స్వర్ణలత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు సంఘాల మహిళలు మాట్లాడుతూ రుణాలు పూర్తిగా చెల్లించామని, వాటిని బ్యాంక్‌కు చెల్లించకుండా స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

● ఏఐసీసీ కార్యదర్శి నవీన్‌జావిద్



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి నవీన్‌జావిద్

కొండపి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి నవీన్‌జావిద్ అన్నారు. కొండపిలో కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం కొండపి వచ్చారు. ఈ సందర్భంగా కొండపిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీని గ్రామస్థాయి నుంచి, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నామన్నారు.


కంభం మండలం హజరత్ గూడెంలో స్వామిత్వ సర్వే కరపత్రాలను ప్రదర్శిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

ఇళ్లు, ఖాళీ స్థలాలకు కొలతలు వేసి హద్దులు

● స్వామిత్వ కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వరరావు

కంభం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ కార్యక్రమంలో అధికారులు ప్రతి ఇంటికీ, ఖాళీ స్థలాలకు కొలతలు వేసి హద్దులు నిర్ణయించి హక్కు పత్రాలు అందజేస్తారని జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. కంభం మండలం హజరత్ గూడెంలో సర్పంచ్ మహబూబ్ పీరా అధ్యక్షతన జరిగిన స్వామిత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాల్లో అర్హులై ఉండి సొంత ఇళ్లు లేని ప్రతిఒక్క లబ్ధిదారుడికి సొంత స్థలం ఉంటే సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించి గృహనిర్మాణానికి అవసరమైన హక్కు పత్రాలను అందజేస్తారని, అందులో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, ఎంపీడీవో వీరభద్రాచారి, ఈవోఆర్డీ విజయలక్ష్మి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు

గిద్దలూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయ నమోదు కార్యక్రమాన్ని ఈసంవత్సరంలో జూలై ప్రారంభించారు. సంఘం గిద్దలూరు మండలశాఖ అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గిద్దలూరు మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఎయిడెడ్, ఉన్నత, ట్రైబల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను 380 మందిని యూటీఎఫ్‌లో సభ్యులుగా చేర్పించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అత్యధిక శాతం మండలంలో నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రమణరెడ్డి, సీనియర్ సంఘ నాయకులు వేమయ్య, ఖాదర్, సుబ్బరాయుడు, మహానందిరెడ్డి, రంగారెడ్డి, రామచంద్రరెడ్డి, ఆవుల రాజు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలతో టీడీపీ నాయకులు

టీడీపీ బలోపేతానికి ఐక్యంగా కృషి

● బూత్ కమిటీల పరిశీలకుడు శ్యామల కాశిరెడ్డి

పెద్దదోర్నాల,నవంబరు 28(ఆంధ్రజ్యోతి):టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పోలింగ్‌బూత్ కమిటీల పరిశీలకుడు, జిల్లా కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక ఏపీ టూరిజంలో మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ మాబు అధ్యక్షతన మండలంలోని బూత్ కన్వీనర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై నిశితంగా చర్చించారు.గత ఎన్నికల్లో ఏయే వార్డుల్లో ఓట్లు తగ్గాయి.ఎందుకు తగ్గాయి. ఏమి చేస్తే టీడీపీ బలం పుంజుకుంటుంది. ఆ వార్డుల్లోని సమస్యలు ఏమైనా ఉన్నాయా, ఓటర్లకు ప్రభుత్వ పథకాలను చేరవేస్తూ, చేస్తున్న అభివృద్ధిని తెలియజేస్తూ చైతన్యపరచాలని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు తోడ్పడాలని తద్వారా ఓటు శాతం పెంపొందేలా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి, నాయకులు దేసు నాగేంద్రబాబు, జీ వెంగళ రెడ్డి, దర్శనం దేవయ్య, ఆర్. కృష్ణయ్య, గోవిందు, షేక్ మౌలాలి, కే సుబ్బారెడ్డి, బి. మంతన్న, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు

పొదిలి కొండను మర్రిపూడి కొండగా మార్చడం సరికాదు

పొదిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి రాజుల కాలంనుంచి పొదిలి కొండగా పిలవబడుతున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయాన్ని కేవలం మర్రిపూడికే పరిమితం చేస్తూ జీవో తేవడం సరికాదని మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మంజునాథ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం జిల్లా ప్రకటించారు.. అందుకు సంతోషమని దాన్ని అడ్డుగా పెట్టి దేవాలాయాన్ని మార్చడం ఏమిటని ప్రశ్నించారు. జీవోను మరొకసారి పునరాలోచించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు గుజ్జుల సంజీవరెడ్డి, నగరపంచాయతీ అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కొనకనమిట్ల జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, కొనకనమిట్ల పార్టీ అధ్యక్షుడు శంకరరెడ్డి పాల్గొన్నారు.

జగదాంబకు శుక్రవారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ మాతకు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ శర్మలు మార్కండేశ్వర స్వామి, జగదాంబలకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

రైతును రాజును చేయాలన్నదే లక్ష్యం

● మార్కాపురం ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెదారికట్ల గ్రామంలో శుక్రవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతును రాజును చేయాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని చెప్పారు. ఇందుకోసం రైతన్నా మీకోసం అనే పథకాన్ని ఐదు సూత్రాలతో అధికారులను, నాయకులను రైతు ఇంటివద్దకే పంపి వారికి వ్యవసాయంలో రైతులకు ఏమికావాలో వారిఅవసరాలకు తగ్గట్టుగా సర్వే చేసి నివేదికలు పంపాలని, వాటి ఆధారంగా రైతు సమస్యలను తీరుస్తారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిందని అన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నారా లోకేష్‌లు ఎన్నికలలో చెప్పినట్లుగానే ప్రత్యేక జిల్లా చేశారని, వారికి మనం ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలని పేర్కొన్నారు. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్ వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తికాకుండా పూర్తిచేసినట్లు ప్రాజెక్ట్ ప్రారంభించి ఈప్రాంత ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనులు చకచకా జరుగుతున్నాయని, త్వరగా పూర్తిచేసి ప్రజల రుణం తీర్చుకుంటామని చెప్పారు. అనంతరం మార్కాపురం నియోజకవర్గాన్ని జిల్లాగా చేసినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్‌ల చిత్రపటాలకు టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో పొదిలి మార్కెట్‌యార్డు ఛైర్మన్ డాక్టర్ ఇమామ్‌సా, దర్శి ఏడీఏ బాలాజీనాయక్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, పొదిలి, కొనకనమిట్ల వ్యవసాయ అధికారులు డి.శ్రీనివాసరెడ్డి, ప్రకాష్‌రావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మోరబోయిన బాబురావు, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖ్‌దేవ్, టీడీపీ నాయకులు పరిటాల సుబ్బయ్య, సిద్దవరం మాజీ సర్పంచ్ కిలారి బొంతయ్య తదితరులు పాల్గొన్నారు.


పెదారికట్ల గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం

- కృతజ్ఞతా సభలో ఎమ్మెల్యే, నేతలు

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పశ్చిమ ప్రకాశం మొత్తం జీవితాంతం రుణపడి ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జిల్లా ప్రకటన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని 32వ వార్డులో ముఖ్యమంత్రికి కృతజ్ఞత సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల ముందుగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల వెనుకబాటుతనానికి చరమగీతం పాడినట్లేనన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని మరువకుండా ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాకు ఆమోదం తెలిపారన్నారు. నూతన జిల్లాను అన్ని రంగాల్లో సీఎం చంద్రబాబు తప్పకుండా ముందుకు తీసుకెళ్తారన్నారు.


పొదిలిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

మీర్జపేటలో సంబరాలు

తర్లుపాడు : మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించటం పట్ల మండలంలోని మీర్జపేటలో సంబరాలు అంబరాన్ని అంటాయి. బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లాగా చేయటం ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారపు నాగతిరుపతయ్య, మాజీ ఎంపీపీ పులివేముల యేసుదాసు, రోశప్పనాయుడు, గుర్రపుసాల నరసింహులు, కందుల చిట్టిబాబు, రాజారపు గురవయ్య, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


తర్లుపాడు మండలం మీర్జపేటలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రన్నకు జేజేలు

పొదిలి: మార్కాపురం జిల్లాగా ప్రకటించడంపై మండల తెలుగుతమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం పెద్దబస్టాండ్ సెంటర్లో ఉన్న అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వెనుబడిన ప్రాంతాన్ని గుర్తించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు చంద్రబాబునాయుడికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. అనంతరం చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలభిషేకం చేశారు.


బేస్తవారపేటలో పాలాభిషేకం చేస్తున్న నేతలు

కంభం టీడీపీ కార్యాలయంలో సంబరాలు

కంభం : జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన మార్కాపురంను జిల్లా చేసినందుకు కంభం మండల టీడీపీ నాయకులు శుక్రవారం స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కంభం మండల టీడీపీ అధ్యక్షుడు తోట వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల కోరికను తీర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఆరేపల్లి మల్లిఖార్జున, కేతం శ్రీనివాసులు, కొత్తపల్లి శ్రీనివాసులు, తోట శ్రీను, గోన చెన్నకేశవులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కంభంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బేస్తవారపేటలో..

బేస్తవారపేట : మార్కాపురంను జిల్లా చేయడంతో పాటు గిద్దలూరు నియోజకవర్గాన్ని మార్కాపురం డివిజన్‌లోనే ఏర్పాటు చేయడంపై శుక్రవారం బేస్తవారపేటలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి,కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, మూప్పూరి రాము, సైదులు, రోషన్‌బాబు, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యాల కల్పనే టీడీపీ లక్ష్యం

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) ఎర్రగొండపాలెం మసీదు బజారులో రూ.6లక్షల నిధులతో సైడు కాల్వ నిర్మాణపు పనులను శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు. 18 నెలలలో కోట్లాదిరూపాయలతో సీసీ రోడ్లు నిర్మించామని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ఆశయం అని అన్నారు. మార్కాపురంను జిల్లాగా ప్రకటించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీర్చాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పి. రామసుబ్బయ్య, టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

21 మందికి రూ.20.92 లక్షల చెక్కులు అందజేత

ఆపన్నులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, అడిగిన ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయం చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో శుక్రవా రం 21 మందికి రూ. 20,92,730 లక్షల నగదు చెక్కు లు పంపిణీ చేశారు. వైద్యంకోసం ఎవరు దరఖాస్తు చేసినా వెంటనే స్పందించి సహాయం చేస్తున్న ముఖ్యమంత్రి పట్ల కృతజ్ఞత కల్గిఉండాలని కోరారు.

పేద మహిళకు రూ. 10 వేల ఆర్థిక సహాయం

ఎర్రగొండపాలెం మసీదు బజారులో నివాసం ఉంటున్న మహిళ షేక్ హసీనా బియ్యం కార్డులేదని, అనారోగ్యం ఉందని చెప్పడంతో కార్డు మంజూరు చేయిస్తానని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు హామీ ఇచ్చారు. అలాగే రూ. 10 వేలు నగదు ఆర్థిక సహాయం చేశారు. శుక్రవారం ఆ వీధిలో ఎరిక్షన్‌బాబు పర్యటిస్తుండగా ఆ మహిళ తన సమస్యను తెలుపుకుంది.


మసీదు బజారులో సైడు కాల్వ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

ఎర్రగొండపాలెం రూరల్ : బడుగు బలహీన వర్గాల కోసం పోరాడి వారి హక్కులను సాధించిన మహోన్నత నేత జ్యోతిరావు పూలే అని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంగళ రెడ్డి, బీసీ నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, మహేష్ నాయుడు, మెడబలిమి వెంకటేశ్వరరావు, టీసీహెచ్ చెన్నయ్య, పండ్ల బ్రహ్మయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు సన్మానం

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో వివిధ విభాగాలలో బంగారు, వెండి పతకాలు సాధించిన బాలికలను వాసవి జాగృతి మిత్ర మండలి క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. వారికి హ్యాండ్ బ్యాగ్‌లను అందజేశారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు బంగారు, వెండి పతకాలు వివిధ విభాగాలలో సాధించగా వారిని సన్మానించారు. వీరి కరాటే మాస్టర్ బూతరాజు శ్రీనివాసులును అభినందించారు. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శివపురం హరి కృష్ణ, కార్యదర్శి కోటా కృష్ణ పాల్గొన్నారు.


కరాటే విజేతలను సన్మానిస్తున్న వాసవి మిత్రమండలి ప్రతినిధులు

రాష్ట్ర జట్టుకు ఎంపిక

పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన వి.కార్తీక్ నాయక్ రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. టెన్త్ చదువుతున్న కార్తీక్ నాయక్ స్కూల్ గేమ్స్‌లో మండల, జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. కార్తీక్ నాయక్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు నాయక్, పీఈటీ నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పరీక్ష అట్టల పంపిణీ

పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఉంటూ 10వ తరగతి చదువుతున్న బాలికలకు యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ పరీక్ష అట్టలు, ఇతర సామగ్రిని అందజేసింది. సంస్థ అధ్యక్షులు పి.వేణుగోపాల్, ప్రతినిధులు రత్నం, సిద్దయ్య, కిశోర్, వార్డెన్ పార్వతిభాయి పాల్గొన్నారు.

అర్హత పరీక్ష పాస్ కావాలి

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్షను ఉపాధ్యాయులు తప్పక పాస్ కావాలని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2009 విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిన దగ్గర నుంచి సర్వీసులో చేరిన ఉపాధ్యాయులందరూ టెట్ ఉత్తీర్ణత సాధించాలని, అలాగే ప్రమోషన్ పొందాలంటే కూడా టెట్ పేపర్ పాస్‌కావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 4వ తేదీన జిల్లా వ్యాప్తంగా చేయనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆరోన్ కోరారు. బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను పలు పాఠశాలల్లో ఆవిష్కరించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పశ్చిమ ప్రకాశంపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశం జిల్లాను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మార్కాపురంను జిల్లా చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషికి శుక్రవారం సాయంత్రం టీడీపీ కార్యాలయం ముందు చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశం జిల్లాను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉండాలన్నారు. మార్కాపురం జిల్లా సాధనలో ప్రధాన భూమిక పోషించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పార్టీ శ్రేణులు, నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు షానేషావలి, సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్ యాదవ్, ఎల్.రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ రాజబాబును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఒంగోలులోని కలెక్టర్ భవన్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన చర్చించారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు.


బూత్ కమిటీ సభ్యులతో పరిశీలకుడు శేషాద్రి

అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలి

రాచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్, తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలోని 130, 131, 132, 133, 134, 135, 136 బూత్‌లను శుక్రవారం ఆయన క్లస్టర్ ఇన్చార్జిలను కలిసి పరిశీలించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయాలని, బూత్‌ల బలోపేతానికి కృషిచేయాలని అన్నారు. అనంతరం మార్కాపురంను జిల్లా చేసినందుకు, గిద్దలూరు నియోజకవర్గం మార్కాపురం డివిజన్‌లో కలిపినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పి. చంటి, జి. తాతిరెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, రాచర్ల సొసైటీ బ్యాంకు ఛైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకుడు పి.సనావుల్లా ఖాన్, తెలుగు యువత అధ్యక్షుడు ఎస్. కళ్యాణ్ రెడ్డి, స్థానిక నాయకులు ఎస్. ఆదినారాయణ రెడ్డి, ఎస్. సత్యం రెడ్డి, లింగన్న, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాస్ కుమార్



రాచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల డిప్యూటీ ఎంపీడీవోగా (జీఎస్‌డబ్ల్యూఎస్)గా ఓవీఎస్ శ్రీనివాస్ కుమార్ నియమితులయ్యారు. రాచర్ల ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతుల్లో భాగంగా రాచర్లకు నియమించింది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు చేస్తోందని సీపీఎం నాయకుడు డి.సోమయ్య అన్నారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ మార్కాపురం నగర మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమయ్య మాట్లాడుతూ ఎన్నో సమస్యలు ఉద్యమాల ఫలితంగా పరిష్కారమయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా యద్దనపూడి జడేజా, పి.అజయ్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, డీకేఎం రఫీ, పి.రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ ఖాదర్ వలి స్వామి 174వ ఉరుసు మహోత్సవం ఈనెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు పఠాన్ లతీఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 29న గంధంపూజ, 30వ తేదీన ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తర్లుపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మిర్చి పంటపై తెగుళ్లు విజృంభిస్తున్నాయని, వీటి నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జోత్స్నదేవి తెలిపారు. మండలంలోని నాయుడుపల్లి, తర్లుపాడులలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణకు మందులను స్వయంగా డెమో చేసి రైతులతో పిచికారీ చేయించారు.

ఉద్యోగాలకు 15 మంది ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా హేమాలయ వెల్నెస్ కోటెక్ బ్యాంకింగ్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఆన్‌లైన్ రాత పరీక్ష, నేరుగా జరిగిన ముఖాముఖి ఆధారంగా 15 మందిని ఎంపిక చేశామని ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్, కోటక్ బ్యాంకు సంస్థ ప్రతినిధి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కర్పూర పూజలు

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కర్పూర నగరోత్సవ పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 3 రోజులపాటు నిర్వహించనున్న ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం మూలవిరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కన్నెస్వామి పూజ నిర్వహించారు. గణపతి, చండీ హోమాలను చేశారు. సాయంత్రం మహాపడిపూజ నిర్వహించి దీక్షధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

రేపు భగవద్గీత కంఠస్థ పోటీలు

పట్టణంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆవరణలో ఈనెల 30వ తేదీ ఆదివారం ఉదయం 9గంటలకు భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 11వ అధ్యాయంలోని విశ్వరూప సందర్శన యోగంలో పోటీలు జరుగుతాయని, నర్సరీ నుంచి డిగ్రీ వరకు, మహిళలకు, పురుషులకు విడివిడిగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ అన్నారు. శుక్రవారం సీఎస్‌పురం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రేగులచెలక గ్రామస్థుల సమస్యలపై చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బొబ్బూరి రమేష్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

పామూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్య నభ్యసించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. పామూరు ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థినులకు శానిటరి ప్యాడ్‌లను ఎంఈవో పెద్దిరెడ్డి కోటిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు, బ్యాంకు సిబ్బంది జి .సూర్యతేజ, షేక్ ఖాదర్ జిలాని, బి.వీరబ్రహ్మం, ఎస్.సురేంద్ర, కెసాయిచరణ్, ఎన్.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర్ మృతిపట్ల సంతాపం

పామూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరగళదిన్నె గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సంఘం మండల అధ్యక్షుడు మల్లిబోయిన బాలబ్రహ్మయ్య యాదవ్ కుమారుడు కిశోర్ యాదవ్ గుండెపోటుతో గురువారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు హుటాహుటీన హైదరాబాద్ వెళ్లారు. కిశోర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఆవుల రమణమ్మ, మండ్లా మల్లికార్జున ఉన్నారు.

ఏలూరి నరసింహం మృతి తీరనిలోటు

కనిగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏలూరి నరసింహం మృతి కమ్మ సేవాసమితికి తీరనిలోటని కాకతీయ కమ్మ సేవాసమితి గౌరవాధ్యక్షుడు వీరపనేని చెన్నయ్యచౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పామూరు మండలంలోని కంబాలదిన్నె మాజీ సర్పంచ్‌గా ఏలూరి నరసింహం ఎంతో సేవ చేశారన్నారు. అలాంటి వ్యక్తి నేడు భౌతికంగా లేకపోయినా ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరటంతో పాటు ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్నివ్వాలని వీరపనేని చెన్నయ్యచౌదరి పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 104 మంది ఎంపిక

పామూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఈటీఎస్ అండ్ ఎల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన మెగా జాబ్‌మేళా 104 మంది ఎంపికయ్యారు. ఈ జాబ్‌మేళాకు 201 మంది నిరుద్యోగులు హాజరైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ తెలిపారు. 13 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏలూరి నరేంద్ర, ప్రిన్సిపాల్ మీసాల వెంకటేశ్వర్లు, రమేష్, బెనర్జీబాబు, నదన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, రాయితీలనుసద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.రంగాకృష్ణ అన్నారు. మండలంలోని పెదయిర్లపాడులో శుక్రవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో రఫి పాల్గొన్నారు.

హోమియో మందులు పంపిణీ

పీసీపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్లవారిపాలెం హరిజనవాడలో హోమియో వైద్య విద్యార్థి ధ్యాన్‌చంద్ శుక్రవారం ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. ప్రస్తుత సీజన్‌లో సంక్రమించే చికెన్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించేందుకు ఈ మందులు ఎంతగానో ఉపయోగపడతాయని ధ్యాన్‌చంద్ తెలిపారు. కార్యక్రమంలో దత్తాత్రేయమ్మ, నరసింహం, నారాయణమ్మ, షాలిని, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన ధూళ్ళ వెంకటేశ్వర్లు చికిత్సపొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. 20 రోజుల క్రితం పురుగు మందుతాగగా, వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మొదట దర్శిలో చేర్పించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కనిగిరి పట్టణాభివృద్ధికి కృషి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణాభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. వినూత్న ఆలోచనలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని 2వ వార్డులోని శివనగర్ కాలనీలో ఛాయ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పర్యటించారు. ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు కావాల్సిన వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సంబంధిత అధికారులను పిలిపించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పార్టీ ఆధ్వర్యంలో కేఎస్ఎస్ సభ్యులు నిర్వహించాల్సిన కార్యక్రమాలను, ప్రజా సమస్యలను తెలుసకుని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నాగులుచెరువలోకి నీరు చేరిందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తద్వార భూగర్భజలాలు పెరిగి బోరు మోటార్లు పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, ఎస్ఐ టి.శ్రీరాం, విద్యుత్ ఏఈ పవన్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

పామూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొట్లగూడూరులో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిమాండ్ ఆధారిత పంటలను సాగుచేసి ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. నియోజకవర్గంలో రైల్వే నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. వలసలు నివారించడానికి పామూరు సీఎస్‌పురం మండలాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. పామూరు మండలం దూబగుంటలోనే ట్రిబుల్‌ఐటీ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరగా, గత వైసీపీ ప్రభుత్వం నిర్మాణ పనులు పూర్తిచేయకుండా బల్లిపల్లికి తరలించిందని ఆరోపించారు. దూబగుంటలో ట్రిపుల్‌ఐటీ స్థలం విద్యాసంస్థలకే కేటాయిస్తామన్నారు. వైసీపీ అబద్ధపు ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతులకు కరపత్రాలను పంపిణీచేశారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపాటి జనార్దనరావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఉప్పలపాటి హరిబాబు, వై.బాల, కోటపాటి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, ఏడీఏ జైనాలుద్దీన్, ఏవో టి.అబ్రహంలింకన్, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: బొట్లగూడూరులో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

దొనకొండ రైల్వేస్టేషన్‌లో పట్టాలెక్కని అభివృద్ధి

» తూతూమంత్రంగా సిమెంట్ రోడ్లు, ప్లాట్‌ఫారంపై రేకులషెడ్లుతో సరిపెట్టిన వైనం



రైల్వేస్టేషన్ ముందు తూతూమంత్రంగా చేపట్టి వదిలేసిన గార్డెనింగ్ పనులు

దొనకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్ అభివృద్ధి పట్టాలెక్కలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకం పనులు నత్తతో పోటీపడుతున్నాయి. 26 నెలల క్రితం దొనకొండ రైల్వేస్టేషన్‌తో పాటే ఈపథకం ప్రారంభమైన మరికొన్ని స్టేషన్లలో చేప ట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. రైలు ప్రయాణి కులకు అధునాతన వసతులతో సేవలందుతున్నాయి. దొనకొండలో మాత్రం ఆపరిస్థితి లేదు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు

కేంద్రప్రభుత్వం చిన్న రైల్వేస్టేషన్లు సహితం మహానగరాల్లోని రైల్వేస్టేషన్లతో దీటుగా ఉండాలనే లక్ష్యంతో ఆధునికీకరణ నిమిత్తం ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకానికి దొనకొండ రైల్వేస్టేషన్ ఎంపికైంది. దాదాపు రూ.18 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 6,2023న వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దీంతో దొనకొండ రైల్వేస్టేషన్ ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశించారు. అయితే, దాదాపు రెండున్నర ఏళ్లుగా నత్తనడకన పనులు జరుగుతున్నాయి.

అమృత్‌భారత్ పథకంలో భాగంగా దొనకొండ రైల్వేస్టేషన్ ముందుభాగంలో అధునాతన వెలివేషన్, ప్లాట్‌పామ్ ఆధునీకరణ, షెడ్ల ఏర్పాటు, లిఫ్ట్ సౌకర్యంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన వెయిటింగ్ హాల్ తదితర పూర్తి సౌకర్యాలు ఏర్పాటవుతాయని రైల్వే అధికారులు ప్రకటించారు. శంకుస్థాపన అనంతరం రైల్వేస్టేషన్ ముందుభాగం సిమెంట్ రోడ్లు, గార్డెనింగ్ ఏర్పాటుకు కొద్దిపాటి కట్టడాల పనులు వడివడిగా చేపట్టి, ఆతర్వాత వదిలేశారు. అప్పుడప్పుడు ప్లాట్‌ఫారంపై రేకుల షెడ్ల పనులు చేపడుతూ ఇటీవల కొద్దిపాటి అసంపూర్తితో పూర్తిచేశారు. పనులు ప్రారంభించి వదిలేయటంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కొంతమేర అసౌకర్యంగా మారింది. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు అమృత్‌భారత్ పథకంలో ఎంపికైన దొనకొండ రైల్వేస్టేషన్‌లో నిర్దేశించిన విధంగా అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా రూ.390 కోట్ల విద్యుత్ బకాయిలు

» ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రూ.390 క్లో విద్యుత్ బకాయిలు ఉన్నాయని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. ఇందులో రూ. వంద కోట్లు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించినవని చెప్పారు. మిగతా రూ.290 కోట్లు ఇరిగేషన్, మునిసిపాలిటీ, ఆరోగ్య కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలకు సంబంధించినవన్నారు. ఈనెల రూ.120 కోట్ల బకాయిలు వసూలుచేయాలని లక్ష్యంకాగా, ఇప్పటికే రూ.వంద కోట్లు వసూలుచేసినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ముండ్లమూరు సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ వెంకటేశ్వర్లు సందర్శించారు. సబ్ స్టేషన్‌లో ఫీడర్లను పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రూ.650 కోట్ల నిధులతో 692 గ్రామాల్లో ఆర్‌డీఎస్ పథకం ద్వారా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. తద్వార అన్ని గ్రామాల్లో వినియోగ దారులకు 24 గంటల పాటు త్రీఫేజ్ సౌకర్యం కల్పించటం జరుగుతుందన్నారు. జిల్లాలో వ్యవసాయ కనెక్షన్‌లు ఏడు వేలమంది రైతులు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటికే నాలుగువేలు మంజూరుచేసినట్లు చెప్పారు. మిగతా మూడు వేలు కూడా త్వరలో మంజూరుచేస్తున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఏడు సబ్‌స్టేషన్‌లు మంజూరుకాగా ఇప్పటికీ రెండుచోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 40 ఏఈ పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల తొమ్మిది మంది సబ్ ఇంజనీర్లకు ఉద్యోగోన్నతి కల్పించినట్లు చెప్పారు. ముండ్లమూరు మండలంలో 540 వ్యవసాయ కనెక్షన్‌లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలోని పెద ఉల్లగల్లులో రూ.3.90 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. కార్యక్రమంలో దర్శి డివిజన్ ఈఈ పి.శ్రీనివాసులు, ఏడీఈ రవికుమార్, ఏఈ టి.చినఅంకబాబు, తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరులో సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

తాళ్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పెండింగ్ బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. వినియోగదారులకు సోలార్ విద్యుత్ వాడకంపై అవగాహన కల్గించాలన్నారు. సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు ,ఏడీఈ రవికుమార్, ఏఈ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లి, శంకరాపురం గ్రామాల మధ్య నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు మెరుపుదాడి చేశారు. ఎస్ఐ కె.కమలాకర్‌కు అజ్ఞాన వ్యక్తుల నుంచి సమాచారం అందటంతో దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ముండ్లమూరు, తాళ్ళూరు పోలీసు స్టేషన్‌ల సిబ్బంది ద్వారా శిబిరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో రూ. 3,18,086 నగదు, 19 సెల్‌ఫోన్‌లు, 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఏ గ్రామంలోనైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మండలంలో పేకాట ఆడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో పాల్గొన్న సిబ్బందిని డీఎస్పీ లక్ష్మీనారాయణ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిఉండాలి

ముండ్లమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై రైతులు అవగాహన కలిగిఉండాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పులిపాడులో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వరి పంటలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతులు గురించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షసూచన ఉన్నందున వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు విజయ నిర్మల, గ్రామ టీడీపీ నాయకుడు ఏరేసు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పామూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన ఎంతో అవసరమని వ్యక్తిత్వ వికాసనిపుణులు వెలిశెట్టి నారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన 16 మంది విద్యార్థులకు రూ.ఐదు వందల చొప్పున నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటిరెడ్డి, మానవత సంస్థ సభ్యులు కె.రామిరెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, జి.కొండలరావు, ఎస్.కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

వెలిగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషిచేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ అన్నారు. శుక్రవారం వెలిగండ్లలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తుందని చెప్పారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, దొడ్డా సురేష్‌రెడ్డి, కేసరి రమణారెడ్డి, మజహర్, సందడి మస్తాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కనిగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పూలే ఆశయాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫిరోజ్, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), ముచ్చుమూరి చెంచిరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, కొట్టే ప్రసాద్, జంషీర్, గుడిపాటి ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: సామాజిక విప్లవ కారుడు జ్యోతిరావు పూలే అని సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇమ్మడి శ్రీను, జె.చినసుబ్బయ్య, జి.కొండలరావు, గౌస్‌బాషా, ఎన్.నాగేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ హనీఫ్, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

70మందికి కంటి పరీక్షలు

తాళ్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండంలోని బొద్దికూరపాడులో శుక్రవారం జనతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(జిమ్స్) ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 70మందికి పరీక్షలు నిర్వహించగా, 20మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వారిని ఒంగోలులోని జిమ్స్‌కు తీసుకెళ్లి ఎన్టీఆర్ వైద్యశాఖ పథకం ద్వారా ఆపరేషన్‌లు చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు మాదాల పూజిత, డీవోలు నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బద్దుల శ్రీను

తాళ్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరానికి చెందిన బద్దుల శ్రీనును జిల్లా కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ ఆసంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు, కార్యదర్శి దాసరి పిచ్చయ్య శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఒంగోలులో జరిగిన కాపునాడు సమావేశంలో మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయివరకు కాపునాడును బలోపేతం చేయటంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, చెలగెలశెట్టి సుధాకర్, నిర్మల, తోట త్రివేణి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 11 కుటుంబాలు



ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

పీసీపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురుగుమ్మి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. మురుగుమ్మి గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, మాలకొండారెడ్డి, ఓబుల్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, పుల్లారెడ్డి, పేరారెడ్డి, బాలోబుల్‌రెడ్డి తదితర 11కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు కనిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి క్రిష్ణారెడ్డి, కసిరెడ్డి హనుమారెడ్డి, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీను, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

పీసీపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికి స్వామిత్వ పథకం ఎంతో కీలకమని వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య అన్నారు. స్వామిత్వ పథకంపై శుక్రవారం గ్రామ సచివాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అధికారులు చేపడుతున్న సర్వేలకు గ్రామంలోని ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం పలువురు గ్రామస్థులకు హక్కుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, వీఆర్వో పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యుడు సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశానికి ఎస్.రత్నారెడ్డి అధ్యక్షత వహించారు. హనీఫ్ మాట్లాడుతూ గిట్టుబాటు ధరకు దాన్యం కొంటామంటూ మాయమాటలు చెప్పడమేతప్ప ఎక్కడా కొనుగోలు చేయలేదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి రాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఎస్.తిరుపతిరెడ్డి, పి.నరసింహులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలి

తాళ్లూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటిపన్నుల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఎంపీడీవో పి.అజిత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్నుల వసూళ్లపై కార్యదర్శులు దృష్టి పెట్టి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్రజల నుంచి ఇంటి పన్నును నేరుగా తీసుకోవద్దన్నారు. క్యూఆర్ స్కాన్ ద్వారా బకాయిల చెల్లింపులు జరిగేలా ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. ప్రభుత్వ సర్వేలను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీఎంపీడీవో నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కురిచేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలోని పలు పాఠశాలలను షైనంపాడు డైట్ అధ్యాపకుడు, జిల్లా పరిశీలకులు రాచపూడి జగన్నాదరావు శుక్రవారం తనిఖీలు చేశారు. వెస్ట్ వీరాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థుల హాజరు పరిశీలన, విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు సరైన ఆటస్థలం లేదని ఉపాధ్యాయులు ప్రస్తావించారు. అనంతరం వెంగాయపాలెం మోడల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ టెస్ట్ సర్వేను గొల్లపాలెం ప్రాథమిక పాఠశాలలో పరిశీలించారు. అన్నీ పాఠశాలల్లో ఎస్ఏ-1 మార్కులపై సమీక్ష నిర్వహించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బేస్‌లైన్ టెస్టు పూర్తయిన తర్వాత 1 నుంచి 5 తరగతుల్లో తక్కువ సామర్థ్యం ఉన్న విద్యార్థుల కోసం డిసెంబర్ నెలలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ షెడ్యూల్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫణి సత్యనారాయణ, పావని, శ్రీనివాసులు, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.


● బ్యాంక్ ఆఫ్ ఇండియా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, పెమ్మసాని, నారాయణ, శ్రావణ్‌కుమార్

ఆర్థిక నగరానికి.. అంకురార్పణ


ఇన్సూరెన్స్ కార్యాలయాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, కేశవ్





చంద్రబాబుకే సాధ్యం



దేశంలో తొలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను సైబరాబాద్‌లో చంద్రబాబు నిర్మించారు. అమరావతిలో ఆర్థిక రాజధానిగా ఫైనాన్షియల్ స్ట్రీట్‌ను నిర్మించే అవకాశం ఆయనకే రావడం అసాధారణం. నాడు హైదరాబాద్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అమలు చేసిన కార్యక్రమాలు నేడు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చి ఆర్థిక ఫలాలు అందిస్తున్నాయి. ఎంతో క్లిష్టమైన ఈ బాధ్యతని ఆయన తన భుజాలపై మోసి విజయం సాధిస్తారు.

- నిర్మలా సీతారామన్

ప్రజా రాజధానిగా పరుగులు పెడుతున్న అమరావతి.. ఇక ఆర్థిక కేంద్రంగా మారనున్నది. ప్రధాన బ్యాంకులు అమరావతి కేంద్రంగా కార్యకలాపాలకు అంకురార్పణ జరిగింది. రాజధానిలో ఆయా బ్యాంకులకు కేటాయించిన స్థలాల్లో శుక్రవారం భూమిపూజ జరిగింది. ముంబై నుంచి వచ్చిన ఆర్థిక దిగ్గజ సంస్థల ప్రతినిధులు, బ్యాంకుల ప్రధాన అధికారులు, రాజధాని రైతులు, ఉపముఖ్యమంత్రి, మంత్రుల సమక్షంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఈ వేడుక కోసం ఆర్థికశాఖకు సంబంధించిన ప్రముఖులు అమరావతిలో కొలువుదీరారు. రాజధానిలో బ్యాంకింగ్ రంగం బలోపేతం కావడంతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం చేరువ కానుందని వారు ప్రకటించారు.

ఇక ఆర్థిక కేంద్రంగా అమరావతి

- ఒకేచోట 13 బ్యాంకులు కొలువుదీరేలా ప్రణాళిక
- రాజధానిలో బ్యాంక్ కార్యాలయాలకు శంకుస్థాపన
- భూమిపూజ చేసిన నిర్మలాసీతారామన్, చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో అట్టహాసంగా కార్యక్రమాలు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతిలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని నగరం అమరావతిలో ఒకే చోట 13 బ్యాంకులు కొలువుదీరేలా ఆర్థిక నగరానికి శుక్రవారం అంకురార్పణ జరిగింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రుల సమక్షంలో అట్టహాసంగా బ్యాంకు కార్యాలయాలకు శంకుస్థాన జరిగింది. రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలోని బ్లాక్ 1 వద్ద ఏర్పాటు చేసిన 13 జాతీయ, (మిగతా 6వ పేజీలో)




మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, హాజరైన వివిధ బ్యాంకుల ప్రతినిధులు


ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

- దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఆర్ఎస్‌కే తనిఖీలో రైతులతో కలెక్టర్ వినోద్‌కుమార్

అమృతలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గోవాడ రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని రైతులకు సూచించారు. 2 వేలు గోనె సంచులు, టార్పాలిన్ పట్టాలను అధికారులు అందజేస్తారని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమ కార్యాలయానికి తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వరరావు, తహసీల్దారు కూచిపూడి నెప్రహరాబాబు, ఎంపీడీవో మారుతీశేషమాంబ, ఏవో భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గోవాడలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

దిత్వా.. అలర్ట్



- తుఫాన్‌తో జిల్లాకు వర్ష సూచన
- నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దిత్వా రూపంలో మరో తుఫాన్ దూసుకువస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో బలపడిన దిత్వా తుఫాన్ ప్రభావం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలపై ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తుఫాన్ ప్రభావంతో శనివారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు చెట్ల కింద నిలబడరాదని విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసింది. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. రైతులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రైతు కంట కునుకు కరువు...

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో వరి సాగు చేసిన రైతు కంట కునుకు కరువైంది. మొన్నటి దాకా మొంథా తుఫాన్ ప్రభావం వల్ల అల్లాడిపోయిన రైతుల్లో దిత్వాతో ఆందోళన నెలకొంది. చాలా చోట్ల కోసిన ధాన్యం చేలల్లోనే ఉంది. కళ్లాల్లో ఉన్న ధాన్యం వర్షాలకు తడిస్తే మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. వర్షంతో పంట పూర్తిగా దెబ్బ తినే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని సీసీఐ కొనుగోలు చేయడం లేదు. తేమ శాతం 15 నుంచి 22 వరకు ఉండగా సీసీఐ 12 శాతం లోపు తేమ ఉంటేనే మద్దతు ధర చెల్లిస్తామని సీసీఐ చెబుతుంది. ఈ పరిస్థితి లో తీసిన పత్తిని ఇంట్లో నిల్వ ఉంచే అవకాశం లేని రైతులు క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ తుఫాన్ వస్తే మరో నెల వరకు పత్తిలో తేమ శాతం తగ్గే అవకాశం ఉండదు.

బర్లీ.. బంద్

- అదనపు కొనుగోళ్లు లేనట్లే
- మార్క్‌ఫెడ్ నిర్ణయంతో రైతుల్లో నిరాశ
- బకాయిలు విడుదల.. ప్రాసెసింగ్‌కు టెండర్లు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతుల వద్ద ఇంకా బర్లీ పొగాకు నిల్వలు గణనీయంగానే ఉన్నాయి. రైతుల వినతి మేరకు అదనపు కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. మొంథా తుఫాన్ ధాటికి బర్లీ పొగాకుకు కూడా నష్టం జరిగిందని, అదనపు కొనుగోళ్లకు కొన్ని మినహాయింపులతో అనుమతి ఇవ్వాలని రైతులు అభ్యర్థించారు. ఈ పరిస్థితుల్లో త్వరలో అదనపు కొనుగోళ్లకు అనుమతి వస్తుందని రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే వారిని నిరాశ పరుస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకుంది. బర్లీ కొనుగోళ్ల అంకం ముగిసినట్లేనని, అదనపు సేకరణ లేదని రాష్ట్రస్థాయి అధికారులు స్పష్టం చేశారు. కానీ ఇంకా క్షేత్రస్థాయిలో దాదాపు 40,000 క్వింటాళ్ల బర్లీ పొగాకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. అయినా ఇకపై కొనేది లేదనే మార్క్‌ఫెడ్ నిర్ణయంపై రైతుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రభుత్వం పునరాలోచించి కనీసం మరో 20,000 క్వింటాళ్ల బర్లీ పొగాకును సేకరించడానికి అనుమతి ఇవ్వాలనే అభ్యర్థనలు రైతుల నుంచి వస్తున్నాయి. మార్క్‌ఫెడ్ తీసుకున్న నిర్ణయం పట్ల స్థానికంగా ఉండే నేతల్లోనూ అసంతృప్తి కనబడుతుండడం గమనార్హం.

కేటాయించిన నిధుల సంగతేంటి..

బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం ఆరంభంలోనే మార్క్‌ఫెడ్ రూ.273 కోట్లను కేటాయించింది. ఈ నిధులన్నీ బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని బర్లీ రైతుల మేలు కోసం కేటాయించినవే. అయితే కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.123 కోట్లు మిగులు ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బర్లీ (మిగతా 6వ పేజీలో)

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

విభిన్న ప్రతిభావంతుల పీజీఆర్ఎస్‌లో జేసీ

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఇబ్బందులను గుర్తించి వారి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జేసీ భావన వశిష్ఠ తెలిపారు. నాల్గో శుక్రవారం సందర్భంగా కలెక్టరేట్‌లో ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్లతో నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతిఅర్జీని తక్షణమే పరిష్కరించాలన్నారు. డిసెంబరు 1న నూరు శాతం పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా నుంచి అద్దంకి నియోజకవర్గంలో ఐదు మండలాలు విడిపోతున్నాయని, ఈ గజిట్ నోటిఫికేషన్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలని డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రజలు నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న జేసీ భావన వశిష్ఠ

మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయం

రోడ్ల ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి


గుడిపాడులో రోడ్లును ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడులో రూ.1.77 కోట్లతో నిర్మించిన తారురోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలోకి మార్చడంతో పాటు అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా జిల్లాలో లక్ష 56 వేల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించామన్నారు. నియోజకవర్గంలోని 1922 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందించామన్నారు. రూ.58 కోట్లతో జలజీవన్ మిషన్ కింద నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వరగాని పద్మావతి, ట్రాన్స్‌కో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తహసీల్దారు జీవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రసేన్, టీడీపీ మండల అధ్యక్షుడు సిబోతుల సత్యనారాయణ, నాయకులు కొట్టే రవీంద్ర, మందా నాగేశ్వరరావు, ఆమోస్, మేదరమెట్ల శ్రీనివాసరావు, జాగర్లమూడి జయకృష్ణ, నాదెండ్ల కోటేశ్వరరావు, కారుసాల బాబు, శానం వెంకటేశ్వర్లు, భవాని ప్రసాద్ రెడ్డి, జాగర్లమూడి వీ రాంజనేయులు, చింతం సుబ్బారావు, నేరెళ్ల సుబ్బయ్య, గండే ఏస్కేల్, కరిచేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

మెగా పేరెంట్స్ మీటింగ్.. 5న

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి ● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

చెరుకుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5న జిల్లాలో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మెగా పేరెంట్స్ మీటింగ్, వరి కొనుగోలు, రైతన్నా మీ కోసం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో తప్పనిసరిగా మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ నిర్వహించాలన్నారు. ఈ మీటింగ్‌లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారాన్ని అందజేయాలన్నారు. వచ్చే నెల 5కల్లా పదో తరగతి సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో జిల్లా వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ పట్టలను రైతులకు అందజేస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్‌కు 7702806804కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

మూఢం.. శుభకార్యాలకు విరామం



ఫిబ్రవరి 17 వరకు ముహూర్తాలు లేవు



ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభ కార్యాలకు మంచిరోజులు లేవు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. శుభకార్యాలతో పాటుగా గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

- తుర్లపాటి ఉమామహేశ్వరశర్మ, కోటప్పకొండ

- ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి
- మూడు నెలల పాటు ముహూర్తాలు నిల్
- 82 రోజుల తర్వాతే శుభ ముహూర్తాలు
- పలు రంగాలపై ఆర్థిక ప్రభావం

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మ కాలాలు లేదా మూఢమి లాంటివి జ్యోతిష శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల 26న మార్గశిర మాసం శుద్ధ సప్తి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు ఉండగా.. పుష్యమాసం శూన్య మాసం అవుతుంది. ఇక (మిగతా 6వ పేజీలో)

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆయా ప్రాంతాలకు 41 ప్రత్యేక రైళ్లను నడుపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి - షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి 2026 మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు, డిసెంబర్2 నుంచి 9వరకు (మంగళ) రామేశ్వరం-తిరుపతి (06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని అధికారులు తెలియజేశారు.

తీరప్రాంత అభివృద్ధికి పెద్దపీట

రూ.8 కోట్లతో శాశ్వత వంతెనలకు అంచనాలు
తాత్కాలిక వంతెనలకు భూమిపూజలో ఎమ్మెల్యే కొండయ్య

వాడరేవు(చీరాల), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. ఇటీవల మొంథా తుఫాన్ నేపథ్యంలో కూలిన ఆరు వంతెనల స్థానంలో శుక్రవారం తాత్కాలిక వంతెనల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడరేవు నుంచి రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం వరకు ఇటీవల కూలిన కల్వర్టుల స్థానాల్లో సుమారు రూ.8 కోట్లతో నూతన వంతెన నిర్మాణాలకు అంచనాలు సిద్ధం చేశామన్నారు. జడ్పీ నుంచి రూ.20 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.20 లక్షలతో తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులకు ఉపయోగపడేలా స్నానాల గదులు నిర్మాణ దశల్లో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, నాయకులు రాముడు, పిక్కి నారాయణ, కోటేశ్వరరావు, మామిడాల సుబ్బారావు పంచాయతీరాజ్ అధికారులు తదతరులు ఉన్నారు.


వాడరేవులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆర్థిక నగరానికి.. అంకురార్పణ

(5వ పేజీ తరువాయి)

ప్రాంతీయ బ్యాంకు కార్యాలయాల శిలాఫలకాలు, 2 ఇన్సూరెన్స్ సంస్థల శిలాఫలకాలను ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత రాయపూడిలో ఇటీవల ప్రారంభించిన ఏపీసీఆర్డీఏ కార్యాలయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు ఉన్నతాధికారులతో కలిసి ఆమె సీఆర్డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తొలి పైలాన్‌ను ఆమె ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు మరో పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంకు అధికారులు అక్కడ నిర్మించబోయే భవనాల నమూనాలను వారికి వివరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, పొంగూరి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మంత్రి పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజులు వరుసగా మిగిలిన పైలాన్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో కేంద్ర ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ప్రసంగించారు.

రైతులకు అండగా నిలవాలి : చంద్రబాబు

బ్యాంకులు కిసాన్ క్రెడిట్ రుణాలు ఇస్తే చాలదని, భూములిచ్చిన రైతుల త్యాగాలను గుర్తించి తగు రీతిలో వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి కోరారు. ఐదేళ్లు తమకు అన్ని విధాలా తోడ్పాటు ఇవ్వాలని, ఆ తర్వాత దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన భూమిక పోషిస్తామని నిర్మలా సీతారామన్‌ను కోరారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణానికి, అమరావతి అభివృద్ధికి అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తున్న కేంద్రం బ్యాంకు స్ట్రీట్ నిర్మాణంతో ఆర్థిక ప్రగతికి పునాదులు పడ్డాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, సీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'బర్లీ'.. బంద్

(5వ పేజీ తరువాయి)

పొగాకు కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ చేపట్టినప్పుడు రైతుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ అంకం ముగింపుకొచ్చేసరికి సేకరణ ప్రక్రియపై బర్లీ రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పెండింగ్ బకాయిలతో సహా నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం రూ.150 కోట్ల వరకు బర్లీ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. బకాయి ఉన్న రూ.38 కోట్లను గురువారం బర్లీ రైతుల ఖాతాల్లో జమ చేశామని, బర్లీ పొగాకు కొనుగోళ్లలో మార్క్‌ఫెడ్ పాత్ర దాదాపుగా ముగిసిందనే స్పష్టతను అధికారులు ఇచ్చారు.

గిడ్డంగుల ఖాళీపై దృష్టి..

ఖరీఫ్ ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వస్తుండడంతో గోడౌన్లలో నిల్వ ఉన్న బర్లీ పొగాకును ఖాళీ చేయించడంపై మార్క్‌ఫెడ్ దృష్టి పెట్టింది. నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న ఏఎంసీ గోడౌన్‌లతో పాటు వేర్‌హౌసింగ్ గోదాములను కూడా బర్లీ నిల్వల కోసం మార్క్‌ఫెడ్ తీసుకున్న విషయం తెలిసిందే. బాపట్ల జిల్లాలో 66 ఏఎంసీ గోదాములు ఉండగా, 18 చోట్ల బర్లీ నిల్వలే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 12 చోట్ల బర్లీ నిల్వలను ఉంచారు. ధాన్యం దిగుబడులు మరో వారం రోజుల్లో ఊపందుకోనున్నాయి. ఆ సమయానికే గోడౌన్‌లను ఖాళీ చేయించడంపై యంత్రాంగం దృష్టి సారించింది. బర్లీ పొగాకును ప్రొసెసింగ్ ప్రక్రియ కోసం టెండర్లను ఆహ్వానించాలనే నిర్ణయానికి మార్క్‌ఫెడ్ వచ్చింది.

మూఢం..శుభకార్యాలకు విరామం

(5వ పేజీ తరువాయి)

మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈసారి మూఢంలోనే కలిసిపోతాయి.

మూఢం అంటే

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి.. వాడుక భాషలో మూఢమి(చీకటి) అంటారు. శుభ కార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్రగ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడుతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్రమౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

వ్యాపారులపై ప్రభావం

శుభకార్యాలు లేకపోతే.. వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దె కార్లు, బస్సులు, సన్నాయి మేళం ఇలా సంబంధిత వర్గాలు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

నల్లబర్లీ పొగాకు రైతుల ఖాతాల్లో నగదు జమ

● రూ.50 కోట్లు జమచేసిన ప్రభుత్వం

పర్చూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లి పొగాకు విక్రయించి నేటికీ నగదు పొందని రైతులకు ప్రభుత్వం నగదును వారి ఖాతాల్లో జమ చేసింది. మూడు నెలల క్రితం పొగాకు విక్రయించినా.., నేటికీ నగదు జమకాకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమస్యను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన అధికార యంత్రాంగం పెండింగ్‌లో ఉన్న రూ.50 కోట్లు నగదును విడుదల చేసింది. అవి రైతుల ఖాతాలో జమ అయ్యాయి. దీంతో నల్లబర్లీ రైతులకు ఊరట నందించినట్లయ్యింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో పెట్టుబడులు లేక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం తీసుకున్న చొరవ ఎంతగానో చేయూత నందించి నట్లయ్యింది.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి



మృతి చెందిన హరీష్

ఇంకొల్లు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : అతివేగంతో ద్విచక్రవాహనం నడుపుతూ అదుపుతప్పి రోడ్డు మార్జిన్ లోని కాల్వలో పడి యువ కుడు దుర్మరణం చెందిన ఘటన ఇంకొల్లు-గంగవరం దారిలో శుక్రవారం ఉదయం వెలుగు చూపింది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకా రం ఇంకొల్లుకు చెందిన రావి హరీష్(21) గురువారం రాత్రి తమ స్నేహితుడిని గంగవరంలో వదిలి పెట్టేందుకు స్కూటీపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. వేగంగా వస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డు అంచులో పడ్డాడు. హరీష్‌పై అదేవాహనం పడడంతో ఎవరూ గమనించకపోవడంతో మృతి చెందాడు. శుక్రవారం హరీష్ మృతి చెందడం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. హరీష్ తల్లి రాధిక ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించనున్నారు.

ఉపాధి పనులలో లోపాలు లేకుండా చూడాలి

● గతంలో చోటుచేసుకున్న మరోసారి ఏపీడీ విచారణ

బల్లికురవ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): వలస కూలీలకు గ్రామాలలోనే పనులు కల్పించేలా ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎక్కడైన లోపాలు జరుగుతుంటే, వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని డ్వామా ఏపీడీ సింగయ్య కోరారు. శుక్రవారం 17వ విడత జరిగిన సామాజిక తనిఖీలో పలు గ్రామాలలో పనులలో జరిగిన లోపాలను తనిఖీ బృందాలు గుర్తించాయి, వీటిపై మరోమారు విచారించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. గురువారం ఏపీడీ సింగయ్య ఉపాధి పనులు చేయించిన సిబ్బందిని విచారణ చేపట్టారు. పనులు ఎక్కడ జరిగాయి, మస్టర్లలో ఉన్న లోపాలు, మరియు కొలతలలో తేడాలపై వారి నుంచి వివరణ తీసుకున్నారు. గతంలో పెద్దఎత్తున బల్లికురవ మండలంలో పనులలో అవకతకలను అధికారులు గుర్తించి బాధ్యతపై సస్పెండ్ వేటు వేశారు. వారిని కూడా మరోమారు విచారించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ పనులలో లోపాలను గుర్తించేందుకు ప్రభుత్వం జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఈ కేవైసీ చేయిస్తుందన్నారు. పనుల కూలీలు రెండుమార్లు ఫోటోలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ ఏడాది వెంటనే గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ విచారణలో ఎంపీడీవో కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే దామచర్ల ● ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతుల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు విచ్చేసి తమ సమస్యలను ఎమ్మెల్యేకు రాతపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఒక్కరి సమస్యను అడిగి తెలుసుకోవడంతోపాటు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరిండమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు తోపాటు, రుణాలు మంజూరు, వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎదురవుతున్న సమస్యలపై ప్రజలు విన్నవించినట్లు తెలిపారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కారం అయ్యేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

మత్స్యకారులకు సరుకుల పంపిణీ

కొత్తపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధిత మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పంపిణీ చేశారు. శుక్రవారం రాత్రి కె.పల్లిపాలెంలో జరిగిన కార్యక్రమంలో మత్స్యకార కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లి గడ్డలు తదతర సరుకులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. తీర ప్రాంత గ్రామాలలో అభివృద్ధి తెలుగుదేశం పాలనలో జరిగిందని ఆయన చెప్పారు. గ్రామంలోని 1400 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకారులు సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గొల్లపోతు పేరయ్య, మత్స్యశాఖ ఏడీ ఎస్.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

● ట్రెజరీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మోహన్‌రావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ట్రెజరీశాఖ రాష్ట్ర డైరెక్టర్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ట్రెజరీశాఖ ద్వారా పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని రకాల సమస్యలను సకాలంలో పరిష్కస్తామని చెప్పారు. అందువల్ల పెన్షనర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు జిల్లాలో ట్రెజరీశాఖ పనితీరు తదితర అంశాలపై సంబంధితశాఖల అధికారుల అధికారులతో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ట్రెజరీశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు, ఒంగోలు సబ్ ట్రెజరీ అధికారి ఎన్‌వీ.కృష్ణ, ఏపీటీఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమణారెడ్డి, ఏటీవోలు కేవీ.కెనడీ, ఏపీటీసీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ.కృష్ణ, పి.అక్కేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీఎల్ఎన్.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావుకు నివాళులు



సంతనూతలపాడులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాలు శుక్రవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. స్థానిక వైసీపీ కార్యాలయంలో బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకులు కేవీ.రమణారెడ్డి, బొట్లా రామారావు, కుప్పం ప్రసాద్, దుంపా రవణమ్మ, దుంపా చెంచిరెడ్డి, ఉప్పలపాటి ఏడుకొండలు, రొండా అంజిరెడ్డి, క్రాంతికుమార్, పెట్లూరి ప్రసాద్, దాసరి కరుణాకర్, తాతా నరసింహగౌడ్, పాలడుగు రాజీవ్, షేక్ మీరావళి, సయ్యద్ అప్సర్, బత్తుల ప్రమీల, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

- జిల్లా మాల జేఏసీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని స్థానిక జేఏసీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు మేడిది రవికుమార్, శ్రీహరి, జాన్, కత్తి సుదర్శన్, రత్నం, శాంతారావు, లక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

- దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు స్థానిక కొత్తమార్కెట్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాకుమాను రవి పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పూలే చిత్రపటానికి రిజిస్ట్రార్ హరిబాబు, ప్రొఫెసర్లు నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీవోఏ రాజమోహన్, సీఈ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షపీత్రందేవ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి జ్యోతీరావుపూలే అని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామ్మూర్తి, సీహెచ్‌వీ.సుబ్బయ్య, అంజయ్య, పోలిశెట్టి, పీఎన్ఎస్.చౌదరి, మాధవి, రంగనాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పూలే వర్ధంతిని శుక్రవారం చీమకుర్తి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అణగారిన కులాల ఐక్యవేదిక, బీసీ సంఘాల ఆధ్వర్యంలో బండ్ల కొండలరావు అధ్యక్షతన స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపాన ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, బీసీ నాయకుడు బత్తుల మల్లిఖార్జునరావు, కోటా రాములు, వేమా బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారికి ఘన సత్కారం

● హాజరైన జిల్లాలోని న్యాయవాదులు



న్యాయాధికారి భారతిని సత్కరిస్తున్న న్యాయవాదులు

ఒంగోలు(రూరల్), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధానన్యాయాధికారి ఎ.భారతి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఒంగోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి భారతి మాట్లాడుతూ తోటి న్యాయాధికారులు, న్యాయవాదులు తాను మంచి తీర్పులు ఇచ్చేందుకు ఎంతగానో దోహదపడ్డారని తెలిపారు. ఇక్కడ ఉద్యోగ విరమణ చేయటం కొంతబాధగా ఉన్నప్పటికీ సంతోషంగానే ఉన్నదన్నారు. కేసుల్లో బాధ్యతగా, సమన్వయంతో ఉంటూ మంచి తీర్పులు ఇచ్చేందుకు అందరూ సహకరించాలని ఆమె సూచించారు. అనంతరం బార్ అసోషియోషన్ అధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతో జిల్లా న్యాయాధికారి భారతి జిల్లాలో ఎన్నో ఉత్తమమైన తీర్పులు ఇచ్చారని కొనియాడారు. ఆమె సేవలు మరవలేనివని, చిరస్థాయిగా అందరి మనస్సుల్లో నిలిచి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, కందుకూరు, అద్దంకి బార్ అసోషియోషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

● హాజరైన క్విస్ కళాశాల అధినేత సూర్యకల్యాణ్ చక్రవర్తి



సీలింగ్‌ఫ్యాన్‌ను అందజేస్తున్న సూర్యకల్యాణ్‌చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి వికసిత భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పటల్ వైద్యాధికారులు సుమారు 150మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత, ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉన్నవారిని గుర్తించి తక్షణం వైద్యశాలకు వెళ్ళేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారీస్‌ట్రస్టు, ఎన్ఎస్‌కేసీ ట్రస్టు సంయుక్తంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందించి వారితో కలిసి భోజనం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యానును అందజేశారు. విద్యార్థులకు సైన్స్ టెక్నాలజీ, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్ తదితర అంశాలపై మాట్లాడారు. గ్రామస్థులకు డెస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు రామాంజనేయులు, విజయలక్ష్మి, కార్తీకేయరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త వాసుబాబు, క్విస్ డీన్ వనీత్‌కృష్ణ, పీవోలు శిరీష, వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా శనివారం ఒంగోలు నగరంలో పలుచోట్ల కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ రంగారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక కర్నూల్ రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, భారత్‌పెట్రోల్ బంకు, మారుతినగర్, ఆగ్జీలియం స్కూల్, ఎస్‌బీఐ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తారన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు సూచించారు. మైనంపాడు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్యపనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించాలన్నారు. మంచినీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. మొంథా తుఫాన్ సమయంలో పంచాయతీ సిబ్బంది అందరూ బాగా పనిచేశారని తెలిపారు. మరలా దిత్వా అనే తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉందని, ఈక్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అన్నదాత, పీఎం కిసాన్ సంక్షేమ నగదు పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చాకు కూలీలకు ఇన్సూరెన్స్ కల్పించాలి

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పచ్చాకు కూలీలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వ్యవసాయకార్మికసంఘం నాయకులు డిమాండ్ చేఁశారు. శుక్రవారం పచ్చాకు కూలీలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పచ్చాకు కూలీలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు, పొగాకు బ్యారెన్ వద్ద వద్ద పనిచేసే కూలీలకు వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు మేయర్‌పై అవిశ్వాసం దారుణం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాసం పెట్టడం దారుణమని యాదాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, రాష్ట్ర కన్వీనర్ బత్తిన లక్ష్మీశేఖర్ విమర్శించారు. అవిశ్వాస తీర్మానం పెట్టడాన్ని నిరసిస్తూ అన్ని జిల్లాలో పర్యటిస్తూ శుక్రవారం ఒంగోలుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లూరు జిల్లాలోని కొన్ని రాజకీయ పార్టీలు అవిశ్వాస తీర్మానం పెట్టడం సరికాదన్నారు. రిజర్వేషన్ల ద్వారా గిరిజనులకు వచ్చిన అవకాశాలను దెబ్బతీయడం దారుణంగా ఉందని విమర్శించారు. నెల్లూరు మేయర్ గా తన పదవికి వన్నె తెస్తున్న స్రవంతిని పదవి నుంచి తొలగించేందుకు కుట్రలు పన్నడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విధానాలను మార్చుకోకపోతే తగినమూల్యం చెల్లించక తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చేవూరి వెంకటేశ్వర్లు, చల్లంపర్ల ప్రసాద్, నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న నారాయణ స్వామి వర్ధంతి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భూస్వామ్య, సామ్రాజ్యవాద నిరంకుశ పెట్టుబడిదారి కూటమికి వ్యతిరేకంగా పోరాడిన మాదాల నారాయణస్వామి 12వ వర్ధంతి కార్యక్రమాన్ని వచ్చేనెల 9వతేదీన గుంటూరులో నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీఎస్.సాగర్, నాయకులు బి.పద్మ, అరుణోదయ జాలన్న, అంజయ్య, రాజశేఖర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పొగాకు వేలం : ఆర్ఎం

మద్దిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ కేంద్రంలో పరిధిలో సుమారు 2400 బ్యారెన్‌లలో ఐదువేల మంది రైతులు ఉండగా ప్రభుత్వం అనుమతి ప్రకారం 15.34 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు నిర్వహించారు. ఆర్ఎం రామారావు సూచనల మేరకు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేలం ప్రకియను నడిపించారు. 198 రోజుల పాటు సాగిన వేలం ప్రకియలో రైతు సంఘ అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాల చౌదరి, మండవ గోవిందరాజులు, బోయపాటి వెంకయ్య, మండవ శ్రీరామమూర్తి, రైతులు సమన్వయంతో సహకరించారు. దాదాపు రూ.304 కోట్ల అమ్మకాలు జరిగాయి. గత నాలుగేళ్ల కంటే ఈ ఏడాది అధికంగా పొగాకు సాగు చేశారు. తుఫాన్ల దెబ్బకు పొగాకు దెబ్బతిని పోవడంతో రైతులకు నష్టం కలిగిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అబ్బూరి శేషగిరిరావు కోరారు. 40 కంపెనీలు వేలంలో పాల్గొనగా సగటున రూ.297.99 ధర నమోదైంది.

పదో తరగతి పరీక్షల ఫీజు గడువు పెంపు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా వచ్చేనెల 6వతేదీ వరకు, రూ.50 రుసుంతో 9వతేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో 12వతేదీ వరకు, రూ.500 రుసుంతో వచ్చేనెల 15వతేదీ వరకు చెల్లించవచ్చని చెప్పారు. ప్రభుత్వం చివరి అవకాశం కల్పించినందున ప్రధానోపాధ్యాయులందరూ విద్యార్థులు త్వరగా ఫీజులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ

ఒంగోలు(రూరల్), నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు దళితవాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం డ్వాక్రా రుణాల అవకతవకలపై వెలుగు సీసీలు షేక్ మస్తాన్, స్వర్ణలత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలు సంఘాల మహిళలు మాట్లాడుతూ రుణాలు పూర్తిగా చెల్లించామని, వాటిని బ్యాంక్‌కు చెల్లించకుండా స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

● ఏఐసీసీ కార్యదర్శి నవీన్‌జావిద్



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి నవీన్‌జావిద్

కొండపి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి నవీన్‌జావిద్ అన్నారు. కొండపిలో కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం కొండపి వచ్చారు. ఈ సందర్భంగా కొండపిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీని గ్రామస్థాయి నుంచి, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నామన్నారు.

పంట పొలాలను ముంచెత్తుతున్న దుమ్ము దూళి

పెట్టుబడి నష్టపోతామంటున్న రైతులు

బల్లికురవ. నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మార్టూరు అర్అండ్‌బి రోడ్డులో రోడ్ల వెంబడి ఉన్న పంటలకు దుమ్ము దూళితో నష్టం వాటిల్లుతోంది. నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తారు రోడ్డు మట్టి రోడ్డుగా మారింది. దీంతో రోడ్డుపై నుంచి వస్తున్న దుమ్ము పంటలపై పడి ఎదుగుదల లేకుండా పోతున్నాయి. అధికారులు కనీసం మరమ్మతులు చేయడం లేదని లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ, రోడ్డు దుమ్ముతో పంట చేతికి రావటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ముతో ఏటా పంటల సాగు



అధ్వానంగా ఉన్న రహదారి





లారీ వెంబడి లెగుస్తున్న దుమ్ము, పత్తిచేలపై పడిన దుమ్ము

సీజన్‌లో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు వాహనాలు వెళుతుంటే వెనుక వచ్చే ప్రజలు దుమ్ముతో ఉక్కిరి బిక్కిరి అయి ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు.

బల్లికురవ-మార్టూరు అర్అండ్‌బీ రోడ్డులో నాలుగు కిలోమీటర్ల రోడ్డు పూర్తిస్థాయిలో తారు రోడ్డు మట్టి రోడ్డుగా మారింది. ఈ రోడ్డులో ముందు వాహనం వెళితే వెనక వెళ్లే వారు దుమ్ములో మునిగి పోతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అధ్వానంగా తయారైన నాలుగు కిలోమీటర్ల రోడ్డు కిరువైపులా నక్కబొక్కలపాడు, మూర్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతులు మొక్కజోన్న, మిర్చి, కంది, పొగాకు, కూరగాయాల పంటలను బోరు బావులు వర్షాధారంగా సాగు చేశారు. ఈ పంటలు రోడ్డు నుంచి వస్తున్న దుమ్ముతో ఎదుగుదల లేకుండానే ఎండి పోతున్నాయి. రైతులు పలుమార్లు తాము పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నామని రోడ్డును వెంటనే అభివృద్ధి పరచాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని బల్లికురవ మార్టురు అర్అండ్‌బీ రోడ్డును అభివృద్ధి పరిచే వరకు ప్రతి రోజు రోడ్డుపై ఉదయం సాయంత్రం దుమ్ము రాకుండా నీటిని చల్లించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రతి మహిళకు సొంతింటి కల సాకారం చేస్తాం

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రజా కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందని, ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీ4 కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా రేషన్ కార్డులు తొలగించారన్నారు. దీంతో నిరుపేదలకు సంక్షేమాలు అందకపోవడంతో పాటు నిలువ నీడ కూడా లేక అవస్థలు పడుతున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ప్రతి అర్జీని స్వయంగా స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నూతన గృహాలకు అందిన అర్జీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 261 అర్జీలు రాగా, సుమారు 220 నివేశన స్థలాలు, నూతన గృహాలకు సంబంధించి ఉండగా, 29 పింఛన్‌లు, 12 ఇతర సమస్యలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంపీ ఛైర్మన్ జనార్ధనరావు, పట్టణ అధ్యక్షులు సురేష్, నాయకులు, గుద్దంటి చంద్రమౌళి, నాదెండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ప్రసవ సమయంలో శిశువు మృతి

- వైద్యశాల వెలుపల తండ్రి శివయ్య నిరసన
- ద్రోణాదుల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఘటన

మార్టూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ప్రసవ సమయంలో శిశువు మృతిచెందిన ఘటన మండలంలోని ద్రోణాదుల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. జంద్రాజుపల్లి పరమేశ్వరి అనే మహిళ శుక్రవారం ప్రసవం కోసం వచ్చింది. గురువారం ఇద్దరు మహిళా వైద్యురాళ్లు పద్మజ, డెల్ఫిన్‌ల ఆధ్వర్యంలో ఆమెకు ప్రసవం చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే శిశువు ఉలుకు పలుకూ లేకపోవడంతో 108కి సమాచారం అందించారు. వారు ఆస్పత్రి వద్దకు వచ్చి తల్లి, బిడ్డను మార్టూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తీసుకొచ్చారు. దీంతో మార్టూరు ఆస్పత్రి వైద్యులు తల్లి బిడ్డను పరీక్షించారు. వారిలో బిడ్డ చనిపోయినట్లు ధ్రువీకరించారు. అనంతరం తల్లిబిడ్డను వారి భర్త, బంధువులు ద్రోణాదుల గ్రామంలోని తమ ఎస్సీ కాలనీలోని ఇంటికి తీసుకువెళ్లారు. ఇదిలా ఉండగా చనిపోయిన బిడ్డ తండ్రి, పరమేశ్వరి భర్త శివయ్య, ఆయన బంధువులు వైద్యులు నిర్లక్ష్యవైఖరి కారణంగా తన బిడ్డ చనిపోయారని, ఆరోపిస్తూ ఆస్పత్రి బయట నిరసన తెలిపారు. రెండు గంటల సేపు బైఠాయించారు. అంతేగాకుండా శివయ్య తరఫు బంధువులు వైద్యులతో, సిబ్బందితో వాదనకు దిగారు. అయితే బిడ్డను బతికించడానికి ప్రయత్నం చేశామని, తల్లి ప్రాణం కాపాడటానికి తప్పనిసరి పరిస్థితుల్లో డెలివరీ చేయాల్సి వచ్చిందని నచ్చజెప్పడంతో వారు వెనుతిరిగారు.



ఆస్పత్రి వరండా వద్ద బైఠాయించిన శివయ్య

తల్లిప్రాణం కాపాడడం కొసమే డెలివరి

ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు ఆమెకు డెలివరీ చేశాం. ఉమ్మ నీరు పోవడంతోపాటు, ఆమెను ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి తీసుకొచ్చారు. సాధారణ డెలివరీ చేస్తున్న సమయంలో మొదట బిడ్డ కాళ్లు బయటకు వచ్చాయి. తరువాత బిడ్డను బయటకు తీశాం. ఈ సమయంలో ఆమెను ఇతర ఆస్పత్రికి పంపించడానికి సమయం లేదు. తల్లి, బిడ్డను బతికించడానికి ప్రయత్నం చేశాం. తరువాత వారిని మార్టూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు 108 వాహనంలో పంపించాం. ఈ విషయాన్ని డీఎంఅండ్‌హెచ్‌వోకు ఆమె భర్తకు చెప్పాం.

డాక్టరు పద్మజ

మండలస్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు ఎంపిక

పంగులూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జె.పంగులూరు మండల స్థాయి పురుష ఉపాధ్యాయుల క్రికెట్‌జట్టు ఎంపిక శుక్రవారం కొండమంజులూరులో నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశానుసారం రాష్ట్రంలో నిర్వహిస్తున్న పోటీలలో పాల్గొనేందుకు మండల స్థాయిలో ఉపాధ్యాయుల క్రికెట్‌కు ఎంపిక చేశారు. ఎంఈవో వీరాంజనేయులు ఎంపిక ప్రారంభించగా, వివిధ క్యాడర్లకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరిలో క్యాడర్ వారీగా 16 మందిని మండల క్రికెట్ జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ మండల సమన్వయకర్త ఏ.హనుమయ్య తెలిపారు. జట్టుకు ఎంఈవో వీరాంజనేయులు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారని, డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్. జిల్లా కార్యదర్శి కొండా ప్రతిమ, హెచ్‌ఎం ఐ.అనిత, వ్యాయామ ఉపాధ్యాయులు మదుమూర్తి, శేషగిరి, హరిబాబు పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ క్రికెట్ జట్టు ఎంపికను ప్రారంభిస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

నేడు మహిళ త్రోబాల్ జట్టు ఎంపిక

మండలస్థాయి త్రోబాల్ మహిళా ఉపాధ్యాయుల జట్టు ఎంపిక శనివారం పంగులూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో వీరాంజనేయులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఎంపిక కార్యక్రమంలో ఆసక్తిగల మహిళా ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

రాయితీ రుణాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ రుణాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి, చింతగుంపల్లి సర్పంచ్ వై.నారాయణరావులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు డీఆర్‌డీవో ఆధ్వర్యంలో బ్యాంకు ఆఫ్ బరోడా చింతగుంపల్లి శాఖ అందజేసిన రూ.25,50,000ల రాయితీ రుణాల చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని ఎంపీడీవో అన్నారు. రుణాలను సక్రమంగా చెల్లిస్తూ జీవనోపాధులతో మహిళలు ఆర్థికప్రగతి సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఎం గడ్డె పెదసుబ్బారావు మాట్లాడుతూ చింతగుంపల్లి గ్రామానికి చెందిన దారా విజయలక్ష్మికి పీఎంఈజీపీ పథకం ద్వారా డీజేకి పది లక్షల రూపాయల రుణం అందజేసినట్లు తెలిపారు. ఇచ్చిన రుణంలో రూ.3,50,000లు రాయితీ పోను మిగిలిన రూ. 6,50,000 లు చెల్లించవలసి ఉంటుందన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా అదే గ్రామానికి చెందిన బెజ్జం రమాదేవికి కంప్యూటర్ ఎంబ్రాయిడ్ కింద ఐదు లక్షలు అందజేసినట్లు తెలిపారు. దీనిలో రూ.1,75,000లు సబ్సిడీ పోను మిగిలినది చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. మరో ఐదుగురికి ముద్ర పథకం కింద రూ.10.50 లక్షలు అందజేసినట్లు ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కె.వెంకటస్వామి, మాధవి, వీవోఏలు ప్రమీల, పరిమళ లితశ్రీలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్

సామాజిక సేవే లక్ష్యంగా ముందడుగు

పీఏసీఎస్ ఛైర్మన్ విన్నకోట సతీష్

నూతలపాడు(పర్చూరు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు నూతలపాడు సహకార సంఘం ఛైర్మన్ విన్నకోట సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నూతలపాడు గ్రామంలో దివ్యాంగులకు చెవిటి మిషన్లు, బెల్టులు, చేతికర్రలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విన్నకోట మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామంలో రూ.2లక్షల వ్యయంతో 10 ట్రై సైకిళ్లు, 80 చెవిటి మిషన్లు, 50 నడుం బెల్ట్‌లతో పాటు, చేతికర్రలను కూడా అందజేసినట్లు పేర్కొన్నారు.



యంత్ర పరికరాలను అందజేస్తున్న పీఏసీయస్ అధ్యక్షుడు సతీష్

అవీ..ఇవీ..

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థుల పట్ల ప్రేమగా మెలగాలి

- మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు



మాట్లాడుతున్న ఛైర్మన్ సాంబశివరావు

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థుల పట్ల వివక్షత విడనాడి, ప్రేమగా మెలగాలని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని నియంత్రణ సంస్థ, జిల్లా నియంత్రణ సమీకృత వ్యూహం దిశా, టిఐ ఆశా రేఖ మహిళామండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ పీడీ సాగర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్‌తో పాటు సీఐ శేషగిరిరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటరావు, ఏఎన్ఎం సీయోను కుమారి, మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీతో విద్యార్థుల్లో నూతనోత్సాహం

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వినూత్న రీతిలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించి నూతన ఉత్సాహం నింపిన కూటమి ప్రభుత్వం తీరు హర్షనీయమని ఎస్ఆర్అండ్‌ఎం హైస్కూల్ హెచ్‌ఎం సాల్మన్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న పాఠశాల పదవ తరగతి విద్యార్థి మోనిష్ జోయల్‌కు అభినందనసభ నిర్వహించారు. ఈ క్రమంలో పొందిన అనుభూతిని అడిగి తెలుసుకున్నారు. జోయల్ వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో అవకాశం దక్కినట్లు వివరించారు. జోయల్ మాదిరిగా ఇతర విద్యార్థులు ఉత్తమంగా రాణించాలని చెప్పారు.



జోయల్‌ను అభినందిస్తున్న లోకేష్

డిసెంబరు 5న వీఆర్‌ఏల ధర్నా



మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్

పంగులూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 5న తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.బందగిసాహెబ్ అన్నారు. పంగులూరు మండల వీఆర్‌ఏల సంఘ సమావేశం స్థానిక రోటరీభవన్‌లో శుక్రవారం నిర్వహించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరు 5న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకురాలు పి.జ్యోతి, అద్దంకి మండల అధ్యక్షులు ధనరాజుపల్లి నాగేశ్వరరావు, నరశింహరావు, కార్యదర్శి కనపర్తి స్వాములు, పంగులూరు మండల అధ్యక్షులు కవల వీరయ్య, వి.ఆర్.ఏ.లు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టి వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో అద్దంకి, కొరిశపాడు, జె. పంగులూరు మండలాల వీఆర్‌ఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేలు, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. డిసెంబరు 5న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో వీఆర్‌ఏలు అందరు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షురాలు జ్యోతి, సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు మర్రిపూడి నరసింహరావు, సంఘ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కనపర్తి స్వాములు, రుద్రు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో పంచసూత్రాలు విలువైనవి

అద్దంకిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'రైతన్న- మీ కోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంలో ముఖ్యమంత్రి పంచసూత్రాల పాత్ర ఎంతో విలువైనదని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మణికేశ్వరం గ్రామంలో వ్యవసాయ సిబ్బందితో కలిసి రైతుల ఇంటి వద్దకు వెళ్లి పంచసూత్రాల కరపత్రాలను రైతులకు అందజేశారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు షేక్ కరిముల్లా, లగ్గిశెట్టి అంజయ్య, వీఏఏ సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

బల్లికురవ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు బల్లికురవ ఉన్నత పాఠశాల ఆవరణలో అన్ని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఆటల పోటీలు శనివారం మధ్యాహ్నం నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్‌లు తెలిపారు. పురుషులకు క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని అన్ని పాఠశాలలకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మొక్కలు నాటిన రోటరీ క్లబ్ సభ్యులు

బల్లికురవ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీక్లబ్‌అఫ్ మార్టూరు, ఎపర్ట్ వారి ఆర్థిక సహకారంతో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనంగా ఉండేలా తమ వంతు మొక్కలను నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగొంట్ల రవికుమార్, రోటేరీయన్ గంగాధర్, మలినేని గోవిందరావు, ఉపాధ్యాయులు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేత

ఇంకొల్లు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ క్లబ్, క్లబ్‌సభ్యులు దాత జెట్టి స్వామి సహకారంతో పేద దివ్యాంగులకు శుక్రవారం వీల్‌చైర్స్ అందజేశారు. ఇంకొల్లుకు చెందిన రామిశెట్టి శ్రీనివాసరావు, విజయకుమారి, పఠాన్ షబీర్, కలవకూరు తులసీ, ఎడ్లూరి మనోజ్‌లకు వీల్‌చైర్స్ అంజేశారు. సుమారు రూ.15 వేల విలువైన వీల్‌చైర్లను రోటరీక్లబ్, జెట్టి స్వామి సంయుక్తంగా నిధులు సమకూర్చి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, ట్రెజర్ గోరంట్ల నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాకరణ పుస్తకాల అందజేత

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు టైమ్స్ ఫౌండేషన్ వారు ఆంగ్ల వ్యాకరణ పుస్తకాలను బహూకరించారు. పాఠశాలలో ఆరవతరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.రవీంద్రబాబు ఆయన సతీమణి తాటి సరోజిని వ్యాకరణ పుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూనాటి బసవయ్య, మోపర్తి వెంకటేష్, రామినేని శివరంజని, గద్దే అపర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు కేమా వీరాంజనేయులు, ఏడుకొండలు, బత్తుల లావణ్య పాల్గొన్నారు.



పుస్తకాలతో విద్యార్థులు

జాతీయ వెబ్‌నార్‌కు విశేష స్పందన

అద్దంకిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు కేఆర్‌కే డిగ్రీ కళాశాల, గుంటూరు సెయింట్ ఆన్స్ మహిళ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అండ్ కంప్యూటర్ సైన్స్ ద్వారా మేధ అనే శీర్షికతో ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన వెబ్‌నార్‌కు విశేష స్పందన లభించిందని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేల్పుల మోహనరావు తెలిపారు. ముందుగా పలు యూనివర్సిటీల నుంచి పలు విభాగాల ప్రొఫెసర్‌లు, వివిధ కళాశాలల అధ్యాపకులు తమ ప్రసంగాలను వినిపించారని తెలిపారు. కార్యక్రమానికి మొత్తం 575 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 29 మంది విద్యార్థులు వక్తృత్వ పోటీలో పాల్గొనగా వారిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటించినట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.2వేలను కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన టి. జాన్‌బానియస్ పొందగా, రెండవ బహుమతి రూ.1500లను కర్నూల్ సిల్వర్ జూబ్లీ కళాశాలకు చెందిన ఈ. లక్ష్మీనరసింహరావు, మూడవ బహుమతి రూ.1000ని గురుకుల పాఠశాల అద్దంకికి చెందిన పావని గెలుచుకున్నారన్నారు. జాతీయ స్థాయిలో ఇంత చక్కని కార్యక్రమం నిర్వహించిన కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పలువురు ప్రముఖులు, విద్యవేతలు అభినందించారు.

పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



పూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న విజయ్‌కుమార్

అద్దంకిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి జీవితంలో ఎదగాలని, వైపల్యాన్ని జయించి ముందుకు సాగాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్ర వారం అద్దంకిలోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో జ్యోతి రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముందుగా విజయ్‌కుమార్, విజయ శ్రీ తదితరులు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతు పూలే దంపతులు చేసిన త్యాగం వలనే స్త్రీలు సమాజంలో అక్షరాస్యులుగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ సురేంద్ర, దమ్ము ఆదికేశవులు, వెంకటేష్, శోభన్, చంటి, హనుమంతరావు, రాంబాబు, రాజ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే త్యాగాలు చిరస్మరణీయం : తహసీల్దార్

కారంచేడు : జ్యోతిబాపూలే త్యాగాలు చిరస్మరణీయమని కారంచేడు తహసీల్దార్ నాగరాజు అన్నారు. 'గులాంగిరి' పుస్తకంతో కులవ్యవస్థను శాస్త్రీయంగా విమర్శించి దళిత హక్కుల కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేదని దన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1873 లో సత్యశోధక సమాజ్‌ను స్థాపించి శూద్రులు, అతిశద్రులకు విద్య, సమాన హక్కులు అందించారన్నారు. స్త్రీ విద్యకోసం ఆయన చేసిన కృషి భారత సామాజిక చరిత్రలో ఒక మైలురాయి వంటిదని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిత , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఇంకొల్లు రామమందిర స్వర్ణోత్సవాలు

ఇంకొల్లు, నవంబరు 28,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు-పర్చూరు రోడ్డులోని రామ మందిరం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30న ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రామమందిరం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అందరూ హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నానో యూరియా పిచికారి చేయండి

అద్దంకిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేనువుకొండ పునరావాస కాలనీ సమీపంలో కొంగపాడు గ్రామానికి చెందిన రైతు రామారావుకు చెందిన చెందిన పొగాకు పొలంపై పొరపాటున కలుపు మందును స్ప్రే చేశారు. దీంతో మొక్కలు ఎండిపోతుండగా, ఆయన వ్యవసాయాధికారును స్పందించారు. స్పందించిన ఏవో పొగ మొక్కలపై నానో యూరియా, 19.19.19 గానీ, 28.28 గానీ స్ప్రే చేయాలన్నారు. ఆయన వెంట ఏఈవో కోటేశ్వరరావు, రైతులు ఉన్నారు.

నేడు అద్దంకిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

- హాజరుకానున్న ఏఐసీసీ పరిశీలకులు శరత్‌అహేర్

అద్దంకి,నవంబరు28(ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు అద్దంకిలోని అంబేద్కర్ భవన్ లో జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ అడుసుమల్లి కిషోర్‌బాబు తెలిపారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ పరిశీలకులు మధ్యప్రదేశ్‌కు చెందిన శరత్ అహేర్, మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, పీసీసీ జనరల్ సెక్రటరీ గంటా అంజిబాబులు హాజరవుతారన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు గడువు పొడిగించినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 6వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుముతో 7 నుంచి 12వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో 10వతేదీ నుంచి 11వతేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో 13 నుంచి 15వ తేదీలోపు చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలని తెలిపారు. అలాగే పరీక్ష రాసేందుకు వయసు తక్కువ ఉన్న పిల్లలు అండర్ ఏజ్ సర్టిఫికెట్ ఫీజు రూ.300 కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాల పేర్కొన్నారు.



జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన కోవూరుపల్లి పీహెచ్‌సీ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరు మెరుగు పడనంటోంది. ఓ పక్క కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నా.. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందిలో మాత్రం మార్పు రానంటోంది. ఇందుకు ఉదాహరణ గత నెల అక్టోబరుకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన గ్రేడ్‌లే నిదర్శనం. జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉంటే ఒక్కదానికి కూడా ఏ గ్రేడ్ రాలేదు. 8 కేంద్రాలకు మాత్రమే బీ గ్రేడ్ దక్కింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పీహెచ్‌సీలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం లేకపోలేదు.

పనితనంలో పతనం!

• పీహెచ్‌సీలలో సేవలపై గ్రేడ్‌ల కేటాయింపు • ఒక్క కేంద్రానికీ దక్కని ఏ గ్రేడ్

నెల్లూరు (వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతి నెల గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. తాజాగా అక్టోబరు నెలకు సంబంధించి పీహెచ్‌సీల గ్రేడ్‌లను ప్రకటించింది. ఎప్పటిలాగే బీ, సీ, డీ గ్రేడ్‌లు తప్ప ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ దక్కలేదు. ఆయా ఆసుపత్రులకు రోజు వారి ఎంతమంది అనారోగ్యంతో వస్తున్నారు. వారికి అందించే వైద్యపరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, ప్రసవాలు వంటి వాటిని పరిశీలించి వైద్య ఆరోగ్య శాఖ పీహెచ్‌సీలకు గ్రేడ్‌లు కేటాయిస్తుంది. జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉండగా కోవూరుపల్లి, రామతీర్థం కేంద్రాలు బీ గ్రేడ్‌లతో ఒకటి, రెండు స్థానాలలో ఉన్నాయి. ఆఖరి స్థానం డీ గ్రేడ్‌లో గట్టుపల్లి, గూడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదన్న విషయంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 23 పీహెచ్‌సీలలో అసలు ప్రసవాలే జరగలేదంటే ఆ కేంద్రాల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో జిల్లాకు రూ.25 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీకి నిర్వహణ, అత్యవసర మందుల కోసం రూ.1.75 లక్షల వంతున విడుదల చేస్తుంది. ఇంతగా ఖర్చు చేస్తున్నా ప్రజలకు అందించే వైద్యసేవలలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు.

● ఏ గ్రేడ్ పీహెచ్‌సీలు ఏవీ!?

తాజాగా విడుదల చేసిన పీహెచ్‌సీల పనితీరులో ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. కోవూరుపల్లి పీహెచ్‌సీ రాష్ట్రస్థాయిలో 241, జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఇక 247వ స్థానంలో రామతీర్థం పీహెచ్‌సీ జిల్లాస్థాయిలో 2వ స్థానంలో నిలిచింది. కుల్లూరు, చేజర్ల, మహ్మదాపురం, సీతారామపురం, జొన్నవాడ పీహెచ్‌సీలు తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. మొత్తం మీద జిల్లాలోని పీహెచ్‌సీలు 55 శాతం ప్రజలకు వైద్యసేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

లోపాలు సరిదిద్దుతున్నాం



పీహెచ్‌సీలలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. రాష్ట్రంలోనే ఏ గ్రేడ్‌లో నిలిపేందుకు కృషి చేస్తున్నాము. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుతున్నాము. గర్భవతులకు అందించే వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అలాగే సాధారణ వైద్య చికిత్సలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నాము.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీల సంఖ్య : 52	ఏ గ్రేడ్ : నిల్	బి గ్రేడ్ : 8	సీ గ్రేడ్ : 36	డీ గ్రేడ్ : 8	ప్రసవాలు జరగనివి : 23



పాదలకూరులో

రగ్బీ పోటీలు

13 జిల్లాల నుంచి క్రీడాకారుల రాక

క్వార్టర్ ఫైనల్స్‌కు నెల్లూరు బాలురు, బాలికల జట్లు

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

- వివరాలు 8లో..

దిత్వా.. జాగ్రత్త!

● మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం

● యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న దిత్వా తుఫాన్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న రెండు రోజులూ జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సముద్ర, నదీతీర ప్రాంతాల్లో ప్రజలను జాగృతి చేస్తున్నారు. అధికారులకు అత్యవసరమైతే తప్ప సెలవులు రద్దు చేశారు.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు : భారీ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమశిల జలాశయం నుంచి 3-4 నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో బి పావని ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి వచ్చే అధిక నీటి ప్రవాహం వల్ల వాగులు, వంకలు, చెరువులు, నీటి కుంటలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.



జంతుగణనపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి కుమారరాజా

1 నుంచి 'వెలుగొండ'లో జంతుగణన

ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి రేంజ్ పరిధిలో విస్తరించి ఉన్న వెలుగొండ అడవిలో వచ్చేనెల 1 నుంచి 8వ తేదీ వరకు జంతు గణన చేపట్టనున్నట్లు రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా పేర్కొన్నారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించి జంతుగణనలో చేపట్టాల్సిన విధివిధినాలు వివరించారు. ప్రతి నాలుగేళ్లకోసారి జంతుగణన చేపట్టడం ఆనవాయితీగా చెప్పుకొచ్చారు. జంతుగణనలో భాగంగా ప్రతి బీట్ అటవీ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో నడుచుకుంటూ మాంసాహార, శాఖాహార జంతువుల పాదముద్రలు, పెంటికలు గుర్తించాలని సూచించారు. పక్కాగా జంతుగణన చేపట్టి గుర్తించిన అంశాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వోలు ప్రసాద్, మురళి, ఎఫ్ఎస్‌వోలు చినవెంకటయ్య, శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు పెరిగిన ఇన్‌ఫ్లో

30 వేల క్యూసెక్కుల నీరు విడుదల

అనంతసాగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద అనూహ్యంగా పెరిగింది. గురువారం 7,287 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా శుక్రవారం నాటికి 10,218 క్యూసెక్కులకు పెరిగింది. ఈ ప్రవాహం ఇంకా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే, డ్యాం నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తుపాన్ ప్రభావంతో ముందస్తుగా ఎక్కువ మోతాదులో నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం జలాశయంలో 72.682 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 400, కండలేరుకు 2,200 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68టీఎంసీలు కాగా ప్రస్తుతం 57.93 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 1900 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, 1080 క్యూసెక్కుల దిగువకు వెళుతోందని ఆయన తెలిపారు.

జిల్లాకు 57,100 కేజీల

జింకు కేటాయింపు

● 17,950 కేజీల స్ప్రే జింకు కూడా..

● డీఏఓ సత్యవాణి వెల్లడి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జింకు లోపం ఉన్న భూములను సరిచేసేందుకు జిల్లాకు 57,100 కేజీల 21శాతం ముడి జింకును ప్రభుత్వం కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సూక్ష్మపోషకాలు అందేనా!?' కథనంపై ఆమె స్పందించి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 1,142 ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని, ఈ ఏడాది 32వేల మట్టి పరీక్షలు చేశామన్నారు. గతేడాది పరీక్షలను బట్టి జిల్లా అవసరాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లాకు 57100 కేజీల 21శాతం ముడి జింకుతోపాటు 17,950 కేజీల 12శాతం స్ప్రే జింకును కూడా జిల్లాకు కేటాయించారని అన్నారు. ప్రస్తుతం ఏయే మండలాల్లో అవసరమో గుర్తించి ముడి జింకును సరఫరా చేస్తున్నామన్నారు. హెక్టారుకు 50 కేజీల ముడి జింకుతోపాటు జీవన ఎరువులు అందిస్తున్నామని, వీటి విలువ సుమారు రూ.5వేల వరకు ఉంటుందన్నారు. నూర శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అదేవిధంగా హెక్టారుకు 250 గ్రాముల 12శాతం స్ప్రే జింకు కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా హెక్టారుకు 250గ్రాముల 12శాతం స్ప్రే జింకు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. అత్యధికంగా 58 ప్రదర్శన క్షేత్రాలను అల్లూరులో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లెక్క.. పక్కా!

● పంచాయతీల్లో పన్నుల వసూలుకు యాప్

8

గంజాయి బ్యాచ్ ఘాతుకం!

నెల్లూరు శివార్లలో యువకుడి హత్య • వేటకొడవళ్లతో నరికి చంపిన దుండగులు • ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతుడు పెంచలయ్య (ఫైల్)

గంజాయి బ్యాచ్ బరితెగిస్తోంది. నిన్నటిదాకా బెదిరించి నగదు, నగలు లాక్కోవడం, దాడులు చేయడం వంటి ఘటనలే జరుగుతుండేవి. తాజాగా మనుషుల ప్రాణాలు తీసే స్థాయికి తెగబడ్డారు. నెల్లూరు రూరల్ మండలం కల్లూరిపల్లిలో గురువారం సాయంత్రం ఓ యువకుడిని అత్యంత కిరాతకంగా వేటకొడవళ్లతో నరికి చంపేశారు. ఈ ఘాతుకంలో గంజాయి సరఫరాకు డాన్‌గా వ్యవహరిస్తున్న ఓ మహిళ ప్రమేయం ఉన్నట్లు స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు..

నెల్లూరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కల్లూరిపల్లి వద్దనున్న ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) కాలనీలో ఉంటున్న కొట్టావిట్టం పెంచలయ్య (35) చిరు వ్యాపారాలు చేస్తుంటాడు. సీపీఎంలో చురుకైన కార్యకర్త కూడా. ఈ క్రమంలో తమ ప్రాంతం గంజాయి సరఫరాకు ముద్రపడటంతో దానిని తొలగించుకోవాలని, ఎవరూ అలాంటి కార్యకలాపాలకు పాల్పడకూడదని స్థానికులు కొందరు గ్రూపుగా ఏర్పడి తీర్మానం చేసుకున్నారు. ఇందులో పెంచలయ్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. కాగా, ఆ ప్రాంతంలో గంజాయి విక్రయాల్లో డాన్‌గా, నేర చరిత్ర కలిగిన వారికి ఆశ్రయం ఇస్తున్న ఆరవ కామాక్షితో పెంచలయ్య బృందానికి విభేదాలు ఏర్పడ్డాయి. కాగ నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో కామాక్షిపై గంజాయి కేసులు ఉన్నట్లు సమాచారం.



రక్తపు మడుగులో ఉన్న కత్తి

● కన్నకొడుకు కళ్లముందే..

శుక్రవారం సాయంత్రం పెంచలయ్య తన కొడుకు నిఖిల్ (10)ని స్కూలు నుంచి తీసుకుని ఇంటికి బయలుదేరాడు. కల్లూరిపల్లిలోని పాత ఇనుప సామాన్ల దుకాణం వద్దకు రాగానే వెనుక నుంచి మూడు స్కూటర్లలో వచ్చిన 9 మంది గుర్తుతెలియని వ్యక్తులు పెంచలయ్యను ఢీకొట్టారు. దీంతో కింద పడిపోయిన ఆయన్ను వేటకొడవళ్లతో అత్యంత కిరాతకంగా నరికి చంపేశారు. అంతా అయ్యాక అక్కడ నుంచి పరారయ్యారు. కళ్లెదుటే కన్నతండ్రిని చంపడం చూసి నిఖిల్ భీతిల్లిపోయాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి పెంచలయ్యను ఆటోలో తీసుకుని జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

● మహిళా డాన్ తమ్ముడే!

పెంచలయ్యను అత్యంత కిరాతకంగా హతమార్చిన ఘటనలో కామాక్షి తమ్ముడు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. హత్య జరిగిన సమయంలో సమీప ప్రాంతాల సీసీ టీవీ ఫుటేజీలను పోలీసులు సమగ్రంగా పరిశీలించగా ఆమె తమ్ముడితోపాటు స్కూటర్‌ను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో భాగస్వాములైన వారంతా 20 ఏళ్ల వయసున్న యువకులుగా తేలినట్లు సమాచారం.



మృతుడి స్కూటర్ ఇదే!

● ఆ సమావేశమే హత్యకు పునాది

ఇటీవల పెంచలయ్య, మరి కొందరు గంజాయి వాడకం వద్దంటూ నెల్లూరు రూరల్ పోలీసులతో కలిసి ఓ సమావేశాన్ని ఆర్డీటీ కాలనీలో ఏర్పాటు చేశారు. గంజాయి వాడేవాళ్లు తమ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలని, లేకపోతే తామే పోలీసులకు పట్టిస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో పెంచలయ్య ఉంటే తమ కార్యకలాపాలకు అడ్డమని నిర్ణయించుకున్న ఆరవ కామాక్షి అతడ్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అప్పటి నుంచే పెంచలయ్యపై రెక్కీ నిర్వహిస్తున్న

- మిగతా 8వ పేజీలో..

కిలో (రూ.లలో)	
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 640	



హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి!

అల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. శుక్రవారం అల్లూరు ప్రధాన కూడలి, వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద యువతకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది హరికృష్ణ, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తాము జీవించి ఉన్నట్లు ప్రతి సంవత్సరం నిర్ధిష్టకాలంలో పంపించే లైఫ్ సర్టిఫికెట్లు జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే పంపించాలని కావలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు, డిసెంబరు నెలల్లో పంపించాలని కొందరు అపోహపడుతున్నారని, అలా పంపిన సర్టిఫికెట్లు చెల్లవన్నారు. జనవరి 1నుంచి ఫిబ్రవరి28 లోపల మాత్రమే సమర్పించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ ఆరోగ్యం కోసం పూజ

కావలి (టౌన్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని వైసీపీ శ్రేణులు, అభిమానులు శుక్రవారం గ్రామ దేవత కలుగోళమ్మ ఆలయంలో కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌నాయుడు అంత్యక్రియల్లో కాకర్ల

జలదంకి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెంలో హత్యకు గురైన టీడీపీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించారు. ప్రసాద్‌నాయుడు హత్య వెనుక ఎంతటి వారున్నా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. కాగా ప్రసాద్ అంత్యక్రియల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపాలి : సీడీపీవో



బాల్య వివాహాలు అరికడదామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉలవపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను రూపుమాపాలంటే ఆడపిల్లలకు చదువు ఒక్కటే మార్గమని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డీ మాధవీలత పేర్కొన్నారు. వీరేపల్లిలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాలు, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు మాత్రమే వివాహం చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియచేయాలని సూచించారు. అదేవిధంగా బాల్య వివాహాల వలన భవిష్యత్‌లో కలిగే నష్టాలను తల్లిదండ్రులకు తెలియపరచాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం బాల్య వివాహాలు అరికడదాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే రమాదేవి, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ జలదంకి శ్రీహరినాయుడు అన్నారు. దగదర్తి మండలం కేకేగుంట గ్రామ టీడీపీ ఇన్‌చార్జి అంబటి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పార్టీ అధ్యక్షుడు నగళ్ళ సుధాకర్ రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూనిట్ ఇన్‌చార్జి మారుబోయిన వేణుగోపాల్, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండోటి తిరుపతి, స్థానిక టీడీపీ నేతలు దొడ్ల దయాకర్, వల్లేపుమల్లి, రాంప్రసాద్, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేత శ్రీహరినాయుడు

గ్రాంట్ ఇస్తేనే.. వస్తాం!

- మొదట రసాభాస.. చివరికి సుఖాంతం
- పెద్దన్న పాత్ర పోషించిన జెట్పీటీసీ
- పాలకుల కోసం అధికారుల ఎదురుచూపులు
- ఆలస్యంగా సాధారణ సర్వసభ్య సమావేశం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండల గ్రాంట్ ఇస్తేనే సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరవుతామని ఎంపీటీసీలు పట్టుబట్టారు. సమావేశ మందిరానికి రాకుండా ఎంపీపీ క్యాబిన్లో చర్చలు జరిపిన ఉదంతం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చోటు చేసుకుంది. దీంతో ఉదయం 11 గంటలకు జరగవలసిన సమావేశం మధ్యాహ్నం 1 గంటకు జరిగింది. అధికారులు 10 గంటల నుండి పడిగాపులు కాయగా, 11 గంటలు వచ్చిన ఎంపీటీసీలు సమావేశ మందిరానికి రాకుండా ఎంపీపీ ఆలూరు కొండమ్మ క్యాబిన్‌కు చేరుకుని గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తేనే సమావేశానికి వస్తామని రసాభాస చేశారు. దీంతో జెట్పీటీసీ జంపాని రాఘవులు పెద్దన్న పాత్ర పోషించాడు. అధికారులను సమన్వయం చేస్తూ ఎంపీటీసీలకు సర్ధిచెప్పటంతో చివరకు సమావేశం 1 గంటకు జరిగింది. మండల గ్రాంట్ నిధులు ఎంపీపీలకు ఇవ్వలేదని సమావేశానికి రాకుండా ఎంపీటీసీలు బాయ్‌కాట్ చేశారు. సమావేశం నిర్వహణపై అధికారులు సందిగ్ధంలో ఉండగా ఎంపీపీ క్యాబిన్‌కు చేరుకున్న ఎంపీడీవో శ్రీదేవి ఎంపీటీసీలతో చర్చించారు. గ్రాంటు వచ్చిన తరువాత ఇస్తామని చెప్పటంతో సమావేశానికి ఎంపీటీసీలు హాజరయ్యారు. మండల గ్రాంట్ వచ్చిన తరువాత పనులు ఇస్తామని ఎంపీటీసీలకు చెప్పడంతో వారు తీర్మానం రాసిచ్చారు. ఇప్పటివరకు ఎంత గ్రాంట్ వచ్చింది? ఏమేమి పనులు చేశారో చెప్పాలని సభ్యులు ఎంపీడీవోను కోరగా కార్యాలయ ఏవో శెలవులో ఉన్నారని, వచ్చిన తరువాత నివేదిక ఇస్తామని చెప్పారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెట్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలి

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



కార్మికులు, ఆర్టీసీ అధికారులతో జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

కావలి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. కావలి ఆర్టీసీ డిపో గ్యారేజీని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. గ్యారేజీ శుభ్రత, నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్యారేజీలో పనిచేస్తున్న సీనియర్ మెకానికల్ సిబ్బంది, ఒప్పందపు కార్మికులను ఆయన సత్కరించారు. గతంలో 65 శాతం ఉన్న ఆక్యుపేషన్ రేషియో100 శాతానికి పైగా పెరిగిందన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేసే సిబ్బందికి పీఎఫ్, ఈ ఎస్ఐ సౌకర్యం కూడా కల్పించామన్నారు. బస్టాండులో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్, నూతన మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు ఆదినారాయణ, ఏఈ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, బస్టాండ్ మేనేజర్ రామక్రిష్ణ, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత!



బిట్రగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని అరికట్టేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ మండలాధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బోగోలు మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, వీఆర్వో సింగారయ్య, ఎంపీడీవో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నవీన్‌కుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.

'పచ్చదనం - పరిశుభ్రత'లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణరావు

కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణరావు పేర్కొన్నారు. థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు వీవోఏలు, పొదుపుసంఘాల లీడర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మా కుంటుంబ కలహాలతో

రవికుమార్‌కు సంబంధం లేదు

- చేజర్ల మహేశ్వర రెడ్డి

కావలి (టౌన్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబ కలహాలతో టీడీపీ నేత పమిడి రవికుమార్ చౌదరికి ఎటువంటి సంబంధం లేదని, ఆయనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చేజర్ల మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జర్నలిస్ట్ క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మహేశ్వర రెడ్డి తన తల్లితండ్రులతో కలిసి మాట్లాడారు. తన భార్య గీతాంజలి చేసిన ఆరోపణలపై వివరణ ఇచ్చారు. 2016లో తనకు గీతాంజలితో వివాహం జరిగిందని, అప్పటినుంచి కొద్ది రోజులు సజావుగా కాపురం సాగిందన్నారు. అకారణంగా తనపై ఆరోపణలు చేసేదని, పెద్దల సమక్షంలో అనేక సార్లు రాజీ ప్రయత్నాలు చేసినా కాపురానికి రాలేదన్నారు. స్వగ్రామమైన దగదర్తి మండలంలో పమిడి రవికుమార్ చౌదరి తనకు భూమిని కౌలుకిచ్చాడన్నారు. ఆయనకు చెందిన ఇంటిలోనే నివాసముంటున్నామన్నారు. తమ కుటుంబానికి అండగా ఉన్నాడన్న అక్కసుతో కుటుంబ కలహాల్లోకి ఆయనను లాగి ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన భార్య ప్రవర్తన నచ్చక విడాకులకు దరఖాస్తు చేశానన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, మన్నెమాల సుకుమార్ రెడ్డి, మనుబోలుపాడు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి ప్రోద్బలంతో పమిడిపై కేసు నమోదు చేయించారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేజర్ల మహేశ్వర రెడ్డి



రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో నాగలక్ష్మి

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో రవాణాశాఖ అధికారులు శుక్రవారం రహదారి భద్రత - మనందరి బాధ్యత అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులనుద్దేశించి ఆర్టీవో టీవీఎన్ నాగలక్ష్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధిగా పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపటం, విశ్రాంతరహితంగా వాహనం నడపటం పూర్తిగా నిషిద్ధమని, ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదాల సమయంలో అత్యవసర ద్వారాలను వినియోగించటం, అత్యవసర సమయా ల్లో పరికరాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి బస్సులో అగ్నిప్రమాదాల నివారణ పరికరం, ఫస్ట్‌ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ జే. అనీల్‌కుమార్, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీవో టీవీఎన్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించి రహదారి భద్రతకై పాటించాల్సిన నిబంధనలపై డ్రైవర్లకు సూచనలు చేశారు.

- **ఉలవపాడు :** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం ఆటోడ్రైవర్లు, ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. ముఖ్యంగా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని సౌండ్ బాక్సులతో అతివేగంగా వెళ్లడం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదుచేస్తామన్నారు. మైనర్ పిల్లలు, లైసెన్స్ లేని వ్యక్తులు ఆటోలు నడపడాన్ని ప్రోత్సహించిన వారిపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలని డ్రైవర్లకు సూచించారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అంకమ్మ

కావలి టిడ్కో గృహాల్లో కార్డెన్ సెర్చ్

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సహకరించాలి : కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ తెలిపారు. రూరల్ సర్కిల్ పరిధిలోని మద్దూరుపాడు టిడ్కో గృహాలలో శుక్రవారం ఉదయం రూరల్ సీఐ రాజేశ్వరరావు సీఐలు, ఎస్ఐలతో కలిసి డీఎస్పీ శ్రీధర్ కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాల్లో నివసించేవారి వివరాలు, వేలిముద్రలు సేకరించారు. ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు, గంజాయి, అక్రమ మద్యం వంటివి ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించారు. సరైన పత్రాలు లేని 23 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏ సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా నిర్వహిస్తున్న కార్డెన్ సెర్చ్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, పాపారావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



టిడ్కో గృహాల్లో ఉన్న వారితో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నేడు జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏబీఎం కాంపౌండ్‌లో ఈనెల 29న జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెంటా సునీల్, ఎస్ విక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలికలకు, అండర్-19 బాలురకు జరిగే పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు.

పైపులైన్ లీకై తాగునీరు వృథా



లింగసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాలలోని తాతా హోటల్ సెంటర్ వద్ద రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి చెందిన వాల్వ్ వద్ద పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. సుమారు 15 రోజుల నుంచి ఈవిధంగా నీరు లీకై వృథాగా పోతుండడంతో ఈ వాల్వ్ వద్ద బురదగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక ఈనీరు రోడ్డు పక్కన చేరి మురికి గుంటగా మారడంతో బస్సులు కూడా ఈ సెంటర్‌లో ఆపకుండా కొంచెం ముందు ఆపుతున్నారు. ఈ సెంటర్ మూడు రోడ్ల కూడలి కావడంతో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురికి గుంట దోమలకు ఆవాసంగా మారి సాయంత్రం అయ్యిందంటే దోమలు విజృంభిస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు, లోకేష్‌కు ఎమ్మెల్యే ఇంటూరి కృతజ్ఞతలు

కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లాల పునర్విభజన కోసం ఏర్పాటుచేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులను కూడా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ సముచిత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తారన్నారు. కాగా, కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరిస్తున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం కందుకూరు డివిజన్ బీటీఏ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కోవూరు రోడ్డు కూడలిలో ఉన్న పూలే విగ్రహానికి బీటీఏ నాయకులు కళ్లగుంట మోహనరావు నేతృత్వంలో పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాల ప్రజలకు అక్షరజ్ఞానం నేర్పించేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పి గంగయ్య, చొప్పర కొండలరావు, గుడిపూడి అంజయ్య, రవీంద్ర, శ్రీనివాసులు, గాలంకి మాల్యాద్రి, గుంతటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి శుక్రవారం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబుల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముచ్చు వేణు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ల రవిచంద్ర, ముచ్చు శ్రీను, చుండూరి శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు గుమ్మా శివ, పసుపులేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి ఘన నివాళి

కావలి (టౌన్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలో పలువురు నివాళులర్పించారు. బీసీ ఐక్యతాభవన్ ఆధ్వర్యంలో ట్రంకురోడ్డు ఆర్టీసీ డిపో ఎదురుగానున్న పూలే విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా వైద్యశాల బ్లడ్‌బ్యాంక్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పలువులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యతాభవన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్ని వరప్రసాద్, గౌరవాధ్యక్షుడు గోవిందు, ప్రధాన కార్యదర్శి పరిశుద్ధరావు, అభిసాగర్, సామాజిక కార్యకర్త మాల కొండారెడ్డి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో బీజేపీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, నాయకులు అమరా వేదగిరి, జ్యోతి బాబురావు, పోట్లూరు శ్రీనివాసులు, బాలగురుస్వామి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, కుందుర్తి శ్రీనివాసులు, షాహుల్ హమీద్ పూలేకు ఘననివాళులర్పించారు. యువ న్యాయవాదులు బెజవాడ అభిసాగర్, గుంజి నరేష్, రామ్ వినోద్‌కుమార్, అనుమలశెట్టి శ్రీనివాసులు, సుకుమార్ జర్నలిస్ట్ బాబూరావు తదితరులు పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు.

సర్వాయపాలెం జడ్పీ స్కూల్లో..

కావలిరూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కావలిరూరల్ మండలం సర్వాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికల కోసం దేశంలో మొట్టమొదటిసారిగా పాఠశాలను ప్రారంభించిన ఘనత పూలేకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కందుకూరు టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



పూలే విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తున్న బీటీఏ నాయకులు, ఉపాధ్యాయులు



కావలిలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పొదలకూరు పట్టణం డీఎస్ఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈవో బాలాజీరావు, పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికల విభాగాలకు సంబంధించి 26 జట్లు తరలివచ్చాయి. మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గెలుపోటములు సహజమని, ఓటమి తర్వాత గెలుపు సాధ్యమేనన్నారు. టోర్నమెంట్ పరిశీలకుడు కే నాగలింగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పోతురాజు రమేష్, ఎంఈవో రేణుక, శోభనాద్రి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటేవారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శైలజ, పీడీలు బీవీ రమణయ్య, దేవిక, టీడీపీ నాయకులు గంటా మల్లికార్జున, బోగోలు భాస్కర్‌రెడ్డి, జనసేన నాయకుడు అనిల్, జిల్లా పీఈటీ అసోసియేషన్ సభ్యులు జీ శ్రీనివాసులు, థామస్ పీటర్ పాల్గొన్నారు.

కాగా, రగ్బీ పోటీలు తొలిరోజు హోరా హోరీగా జరిగాయి. బాలుర విభాగంలో నెల్లూరు, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జట్లు, బాలికల విభాగంలో ఈస్ట్ గోదావరి, కృష్ణ, గుంటూరు, కర్నూలు, వైజాగ్, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు జట్లు శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.


క్రీడా జ్యోతితో పీఏసీఎస్ ఛైర్మన్ మస్తాన్‌బాబు, డీఈవో, అధికారులు

రాష్ట్రస్థాయి బాలికల హాకీ పోటీలకు విస్తృత ఏర్పాట్లు

● జిల్లా జట్టుకు ప్రత్యేక శిక్షణ

నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడాసమాఖ్య 69వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడా జట్లు హాజరు కానున్నాయి. క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజన, వసతులకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే నెల్లూరు బాలికల జట్టుకు ఇప్పటికే ఏసీ స్టేడియంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. క్యాంప్ నిర్వాహకుడు థామస్‌పీటర్, కోచ్‌లు జీడీ సురేష్‌బాబు, పీ నాగేంద్రరావు, పీ పద్మజ మెలకువలు నేర్పుతున్నారు. రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్టు విజయమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.


నెల్లూరు జట్టుకు సూచనలిస్తున్న కోచ్‌లు

లెక్క.. పక్కా!

పంచాయతీల్లో పన్నుల వసూలుకు యాప్ | పారదర్శకత కోసం 'స్వర్ణ పంచాయతీ' | నిధుల దుర్వినియోగానికి చెక్

ఇంటి పన్నుల వసూళ్లలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. పన్నులకు సంబంధించి స్వర్ణ పంచాయతీ అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక నిర్వహణలో పారదర్శకతను పెంచటానికి, నిధుల వినియోగంపై ప్రజలకు సమాచారాన్ని అందించటానికి ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చెల్లింపును సులభతరం చేయడానికి ఈ యాప్‌ను రూపొందించింది.



మర్రిపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుతోపాటు, కుళాయి, వాణిజ్య పన్నులు, ట్రేడ్ లైసెన్స్, వివిధ వేలం పాటలు, సెల్ టవర్ల పన్నులను సిబ్బంది వసూలు చేసేవారు. అయితే ఇలా వసూలు చేసిన మొత్తాన్ని పంచాయతీకి జమ చేయకుండా కొంత సొమ్మును వ్యక్తిగతంగా వాడుకున్న సందర్భాలు గతంలో వెలుగు చూశాయి. అలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త సాంకేతిక తను అందుబాటులోకి తెచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా పంచాయతీ సిబ్బంది పన్నుల వసూళ్ల ప్రారంభించారు. ఆత్మకూరు డివిజన్‌లోని 9మండలాల్లో స్వర్ణ పంచాయతీ ప్రక్రియ పూర్తయింది. కానీ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఒక పక్కన, మరో పక్క ఇంటి అసెస్మెంట్ నెంబరుకు ఆధార్, ఫోన్ నెంబర్లు లింక్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో హడావిడిగా ఎవరెవరివో ఫోన్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు లింక్ చేసినట్లు సమాచారం. తాజాగా వాటిని సరి చేసేందుకు మరి కొంత సమయాన్ని వెచ్చిస్తూ స్వర్ణ పంచాయతీ నిర్వహణ పారదర్శకతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఆత్మకూరు డివిజన్‌లో 184 పంచాయతీల్లో 78,410 కుటుంబాలను ఇంటి యజమాని ఆధార్ కార్డు నెంబరుతో ఆన్‌లైన్ చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగం ఇక కుదరదు

ప్రస్తుతం ఈ యాప్‌తో ఇంటి పన్ను, కుళాయి, ఇతర పన్నులు ఎంతకట్టామన్నది ఆన్‌లైన్‌లో నమోదై ఉంటుం ది. ముఖ్యంగా పన్ను కట్టిన వెంటనే ఎంత చెల్లించామ న్నది వ్యక్తిగతంగా ఫోన్లకు మెసేజ్ వస్తుంది. తద్వారా నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఉండదు. చెల్లించిన పన్నుల నగదు పంచాయతీ ఖాతాలకు జమ కావటంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు దోహదపడుతుంది.

- రమణయ్య, డీఎల్‌పీవో, ఆత్మకూరు

దివ్యాంగ విద్యార్థులకు 10లో ప్రత్యేక రాయితీలు

- దివ్యాంగ విద్యార్థులందరూ పరీక్షలకు హాజరయ్యేలా రవాణా, ఇతర ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారు.
- శారీరక దివ్యాంగులైన విద్యార్థులకు ఏదైనా ఒక భాష పరీక్ష రాయకుండా మినహాయింపు ఇస్తారు. మిగిలిన వాటిల్లో 35 మార్కులు సాధించాల్సి ఉంటుంది.
- అంధులకు కూడా ఒక భాష నుంచి మినహాయింపు ఇవ్వగా మిగిలిన పరీక్షల్లో కనీసం 20 మార్కులు సాధించాల్సి ఉంటుంది.
- వినికిడి లోపం ఉన్న వారికి రెండు భాషల పరీక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరు మిగిలిన నాలుగు సబ్జెక్టులలో 20 మార్కులు తెచ్చుకుంటే ఉత్తీర్ణత సాధించినట్లే !
- మాట లోపం ఉన్న విద్యార్థులు ఆరు సబ్జెక్టులలో 20 మార్కులు తెచ్చుకోవాలి.
- మానసిక వికలాంగులైన విద్యార్థులు అన్నీ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అయితే అన్నింటిలో 10 మార్కులు చొప్పున సాధిస్తే పాస్ అయినట్లే.
- ఇక, కుష్టు, పక్షవాతం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు, మరుగుజ్జులు, యాసిడ్ దాడికి గురైన వారు.. ఇలాంటి వర్గాలకు ఏదైనా ఒక భాష నుంచి మినహాయింపుతోపాటు మిగిలిన పరీక్షల్లో 10 మార్కులు సాధిస్తే సరిపోతుంది.
- అభ్యసన వైకల్యం ఉన్నవారికి ఆంగ్లం నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన వాటిల్లో 15 మార్కులు సాధిస్తే సరిపోతుంది.
- అంధులు, చేతులకు సంబంధించిన వైకల్యం ఉన్న వారు, ఎమ్మార్, సీపీ, న్యూరో సమస్యలతో చేతులు పనిచేయని వారికి ఒక సహాయకుడిని కేటాయించి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. వీరికి అదనంగా మరోగంట సమయం కూడా కేటాయిస్తారు.
- దివ్యాంగ విద్యార్థులకు అవసరం మేరకు వివిధ పరికరాలు, కుర్చీలు, కంటి అద్దాలు, కాలిక్యులేటర్లు, శ్రవణ యంత్రాలు, కృత్రిమ అవయ వాలు, సహాయకులను వెంట తెచ్చుకునేందుకు ముందుగా దరఖాస్తు సుకుంటే అన్నింటికీ అనుమతి లభిస్తుందని అధికారులు తెలిపారు.



నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపులు, రాయితీలు, సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దివ్యాంగ విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకుంటే ఈ రాయితీలను పొందవచ్చు. దీనిపై ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

అవగాహన కల్పించాలి...

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందించే సదుపాయాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ ప్రయోజనాలు పొందేందుకు సదరం వైకల్య సర్టిఫికెట్‌గానీ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ అందించిన మెడికల్ సర్టిఫికెట్‌గానీ అంద చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు నామినల్ రోల్స్ పంపే సమయంలో దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ఆయా వైకల్య కోడ్ నమోదు చేసి పంపితే వారి వైకల్యాల ఆధారంగా మినహాయింపులు ఇచ్చిన సబ్జెక్ట్ మినహా మిగిలిన సబ్జెక్టులకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు మాత్రమే పరీక్ష కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు.

1న మెప్మా మెగా జాబ్‌మేళా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి మొదటిసారిగా జిల్లాస్థాయి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని మెప్మా ప్రాజెక్టు డెరెక్టర్ ఏ.లీలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1న నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఒక కుటుంబంలో-ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడంలో భాగంగా మెప్మా సంస్థ, నిపుణ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. విప్రో, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ అపోలో ఫార్మసీ, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తదితర సంస్థలలో ఉద్యోగావకాశం కల్పించడానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 31 ఏళ్ల లోపు వయస్సు కలిగి, 10 నుంచి డిగ్రీ, పీజీ వరకు చదివిన వారు మెప్మా-నిపుణలో హెచ్‌టీటీపీఎస్: జాబ్‌మేళా.మెప్మా ఏపీ.కామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువతీయువకులు వారి విద్యార్హత సర్టిఫికెట్లతో డిసెంబరు 1న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలు పూర్తయిన వెంటనే ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేస్తామని తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు నవంబరు 30తో ముగుస్తున్న నేపథ్యంలో మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుల పొడిగింపు కాలపరిమితి జనవరి 31వ తేదీ వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ జరిగే వరకు ఏది ముందు జరిగితే అప్పటి వరకు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డులు కలిగిన పాత్రికేయులకు రెండు నెలల పొడిగింపు వర్తిస్తుందని తెలిపారు.

1న గీతా జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 1వ తేదీ గీతా జయంతికి వైష్ణవ ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధ భూమిలో అర్జునుడు, శ్రీకృష్ణ భగవానుడికి మధ్య జరిగిన సంభాషణను భగవద్గీతగా వ్యాస మహర్షి రచించి భావితరాలకు అందించారు. గీతా జయంతి సందర్భంగా ఎన్నో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోలీసులమని చెప్పి చైన్ చోరీ

మనుబోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు అలవాటుపడిన కొందరు యువకులు మోటార్ సైకిళ్లపై వచ్చి చైన్ స్నాచింగ్‌లు చేయడం ఇటీవల సర్వసాధారణమై పోయింది. గడి చిన కొద్దినెలల్లోనే మండలకేంద్రమైన మనుబోలులో ఇలాంటి సం ఘటనలు జరిగాయి. అయితే తాజాగా ఈ దఫా చోరులు పంథా మార్చారు. పోలీసు యూనిఫాంలో వచ్చి, బెదిరించి ఒంటరిగా ఉన్న వృద్ధులు, మహిళలను టార్గెట్ చేసుకున్నారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కొండూరు సత్రం వద్ద సాయిబాబా హోటల్ వద్దకు రెండు మోటార్‌సైకిళ్లపై నలుగురు యువకులు వచ్చారు. ఆ సమ యంలో హోటల్‌కు చెందిన సజ్జా రాధారాణి అనే వృద్ధురాలు దుకా ణం వద్ద ఉంది. ఆమె దగ్గరకు పోలీసు ప్యాంటు (ఖాకీ) ధరించి ఉన్న ఓ యువకుడు వచ్చాడు. నేను గూడూరు సీఐని, ఎస్పీ మేడం నెల్లూరు నుంచి గూడూరుకు వెళుతోంది. ఆమె అన్ని అంగళ్లు తనిఖీ చేస్తుంది. అంగళ్లలో గుట్కాలు, పాన్‌పరాగ్‌లు అమ్మకండి, అవి తీసి లోపల పెట్టుకోండని చెప్పాడు. అలాగే నాయనా.. అంటూ వృద్ధురాలు తలూపింది. ఆమె మెడలో ఉన్న గొలుసును గమనించిన నకిలీ సీఐ ఒంటిమీద బంగారు అవి వేసుకోకండి.. దొంగలు తిరుగుతున్నారని చెప్పాడు. దీంతో ఆమె మెడలోంచి 3 సవర్ల బంగారు దండ తీసి టేబుల్‌కు ఉన్న డ్రాలో దాస్తుండగా, 'నేను దాచిపెడతాను ఇవ్వండి' అంటూ దండను యువకుడి చేతిలోకి తీసుకున్నాడు. డ్రాలో పెట్టినట్లుగా నటించి, దండ, డ్రా తాళం తీసుకుని అక్కడినుండి యువకుడు, అతడి స్నేహితులు ఉడాయించారు. దీంతో వృద్ధురాలు గట్టిగా కేక లు వేయగా, కుటుంబసభ్యులు, స్థానికులు అక్కడికి వచ్చారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి బ్యాచ్ ఘాతుకం!

(5వ పేజీ తరువాయి)

ఆమె, ఆమె అనుచరులు కుమారుడితో ఒంటరిగా వస్తున్న సమయం చూసి ప్రణాళిక ప్రకారం మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. కాగ పెంచలయ్యతోపాటు మరొకరిని కూడా హతమార్చాలని కామాక్షి టార్గెట్ చేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అదనపు ఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసురావు, సీఐ గుంజి వేణు తమ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గూడూరును నెల్లూరులో కలపాలి : బీజేపీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గూడూరు అసెంబ్లీ నియోజక వర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత పేర్నాటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆ పార్టీ నేతలతో కలసి కలెక్టరేట్‌లో ఏవో విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన ప్రాథమిక గెజిట్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలనేది ప్రజల మనోగతమని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మిడతల రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కాగా, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాకు బదలాయిస్తే జలవివాదాలు తప్పవని, వాటిని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ బీజేపీ నమామి గంగే ప్రాజెక్టు రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరశర్మకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఆ మండలాల బదలాయింపు వల్ల కండలేరు డ్యాం రెండు ముక్కలయ్యే అవకాశం ఉందని తెలిపారు.


ఏవో విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న రంగారెడ్డి

పూలే గొప్ప సంఘ సంస్కర్త

● జేసీ వెంకటేశ్వర్లు


జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్షత నిర్మూలన కోసం పోరాడిన గొప్ప సామాజిక ఉద్యమకారుడని చెప్పారు. దేశంలో బాలికల కోసం తొలి పాఠశాలను నిర్మించారని తెలిపారు. ఆనాటి సాంఘీక దురాచారాలను వ్యతిరేకించి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

● ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్

నెల్లూరు(వైద్యం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి : జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని అన్న మయ్య సర్కిల్ వద్ద ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో ఏపీ హంస జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి కమల్‌కిరణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ దశాబ్దాలుగా పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లను తొలగించడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. 25 ఏళ్లు పైబడిన ఏఎన్ఎంల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. హంస జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు, ఎన్నికల అధికారి కప్పా నారాయణ రాజు, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి జలీల్ అహ్మద్, జిల్లా ప్రచార కార్యదర్శి మజార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వింజమూరు, ఉదయగిరి, బుచ్చిరెడ్డిపాళెం తాలూకాల కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ అధ్యక్ష, కార్యద ర్శులు గౌస్‌బాషా, మంజరీ, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి సుజాత పాల్గొన్నారు. ఉదయగిరి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా గాజుల నౌషాద్‌బాబు, కాజామొహిద్దీన్, మహిళా వింగ్ కార్యదర్శిగా చంద్రావతి, వింజమూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా ఝాన్సీరాణి, శ్రీవిద్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.


ఏపీ హంస నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

పొగాకు ధరల్లో హెచ్చుతగ్గులు

● ప్రతీ సంవత్సరం ధరల పెరుగుదల
● పెట్టుబడుల భారాన్ని తగ్గించండి
● పొగనారు రైతుల వేడుకోలు

కలిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటగా పేరుగాంచిన పొగాకు ధరల్లో హెచ్చు తగ్గుల కారణంగా సాగు చేసిన రైతులు ఒక్కోసారి నష్టాల బారిన పడుతున్నారు. అయితే గత నాలుగేళ్ళగా మద్దతు ధర ఆశాజనకంగా ఉంటోంది. ఈ క్రమంలో గతంలో ఒక బ్యారన్ కలిగిన రైతుకు 7.5 ఎకరాల విస్తీర్ణంలో పొగాకు పంట సాగుకు, 35 క్వింటాళ్ల పొగాకు అమ్మకాలకు బోర్డు అనుమతి ఇచ్చింది. గత ఏడాది నుండి ఒక్కొక్క బ్యారన్ కలిగిన రైతుకు 9.3 ఎకరాల విస్తీర్ణంలో పొగాకుపంట సాగుకు 42.75 క్వింటాళ్ల అమ్మకాలకు అనుమతి ఇవ్వడంతో రెండేళ్లనుండి రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు పంట సాగు చేయడానికి సన్నద్ధులవుతున్నారు.

పెరిగిన డిమాండ్.. అదనంగా సాగు

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బోర్డు అనుమతించిన విస్తీర్ణంకంటే ప్రతీ ఏటా పొగాకు పంటను అదనంగా సాగుచేయడం రైతుకు తప్పనిసరయింది. ఈ క్రమంలో పొగాకు సాగుకు అవసరమైన పొగ నారుకు కూడా గతంలో కన్నా విపరీతంగా డిమాండ్ పెరిగింది. కలిగిరి వేలంకేంద్రం పరిధిలో సుమారు 150 నుండి 200 ఎకరాల్లో పొగనారు సాగు చేశారు. బోర్డు ద్వారా అనుమతి పొంది విత్తనాలు తీసుకొని పలువురు రైతులు పొగనారును సాగు చేశారు. నారు సాగుకు సుమారు 40 రోజులనుండి 120 రోజుల వరకు వివిధ దశల్లో నారును పీకి మూటలు కట్టి నారుమడుల వద్ద రైతులకు అమ్ముతారు.

ఏటా పెరుగుతున్న ధరలు

గత మూడేళ్లనుండి ఏటేటా పొగాకు ధరలు పెరుగుతుండడంతో ఎక్కువ మంది రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు రాజమండ్రి తదితర ప్రాంతాలకు మాత్రమే వెళ్ళి పొగ నారు తీసుకొచ్చి నాటేవారు. అయితే పొగాకు బోర్డు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి, పొగనారు చేసే రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చి అవగాహన కల్పిస్తుండడంతో స్థానికంగా పొగనారుకు కూడా మంచి డిమాండ్ ఏర్పడింది.

అదనపు పెట్టుబడులు భారమే...

వర్షాభావ పరిస్థితుల్లో ట్యాంకర్లతో నీరు తోలడం, కూలీలచే మోయించాల్సి వస్తున్నందున అదనపు ఖర్చులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దీంతో వర్షాలు కురిసినపుడు మాత్రమే ఎక్కు వమంది రైతులు సాగు చేస్తున్నారు. దీంతో పొగనారు వద్ద నుండే పెట్టుబడులు పెరిగిపోతున్నాయని, ఈ ప్రభావం సాగుపై పడుతోందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసినపుడు, రైతులు బురద ఏత వేసే క్రమంలో మూట నారు (6 వేల పొగ మొక్కలు) రూ. 4 వేల నుండి రూ. 5 వేలు పలుకుతుంది. వర్షాలు లేని సమయంలో రూ. 2 వేలు మాత్రమే ఉంటోంది. అయితే ఈ ఏడాది ఇటీవల వర్షాలు కురిసినపుడు మూట పొగనారు ధర రూ.7 వేలకు పైగా పలకగా, ప్రస్తుతం రూ. 4వేల వరకు ధర ఉన్నట్లు రైతులు తెలిపారు. దీంతో సాధారణంగా అయ్యే పెట్టుబడి కంటే అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్డు అధికారులు పొగనారు ధరలను నియంత్రించి అదనపు పెట్టుబడుల భారం నుండి ఉపశమనం కలిగించాలని రైతులు కోరుతున్నారు.



ఆటోలో రూ.50.. అంగట్లో 80!

● నింగినంటుతున్న టమోటా ధర

ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. మార్కెట్‌లో గత వారం రోజుల క్రితం కిలో రూ.40 పలికిన టమోటా ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.60, రూ.80కు విక్రయిస్తున్నారు. శుక్రవారం వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ ప్రాంతం నుంచి ఓ వ్యక్తి ఆటోలో టమోటాలు తీసుకొచ్చి కిలో రూ.50 చొప్పున విక్రయించడం, మార్కెట్‌లో రూ.80 పలుకుతుండడంతో ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. రానున్న రోజుల్లో టమోటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంటున్నారు.

